# చావు

—కాళీపట్నం రామారావు.

ఆతతాయిలు సాగించే హింసలా, చలీ, గాలీ, నిరంతరాయంగా, నిరాక్షేపంగా తమ కత్తికోత సాగిస్తున్నాయి. కొయ్య దగ్గర పడివుండే బక్క ఎద్దులా, ఊరు నీరసంగా వుంది. జవసత్వాలుడిగిన ముసిలి రాజులా, సూర్యుడు వెలాతెలా పోతున్నాడు.

"అద్దద్దద్గో అల్లా మిడతాడ కొండ సూసినావా?" అంది సిమ్మాద్రి. ఆ పిల్లలు నిల్చున్న మాం చెర్వు గట్టు ఊరికి దక్షిణంగా వుంది. ఎదురెండ వాళ్ల మొహాల మీద ఏటవాలుగా పడుతోంది.

దాని పిల్ల తన చీకి కళ్ళను మరీ చిన్నవి చేసుకుంది. ఎడం చేయి కళ్ళ కడ్డం పెట్టి, ఎండలోంచి చూసింది. కొత్తగా కోసిన పొలాల్లో వరి మొదళ్లు ఎండకి తళతళ మెరుస్తున్నాయి. ఆకాశం, భూమి కలిసే చోట మావురు కప్పిన మహా వృక్షాలు మరుగుజ్జు సైజులో వున్నాయి.

"నీకళ్ళు గుడ్డే....? అంత పెద్ద కొండ కనపడదా! నాన్సూపుతాను నా సేతి మీణ్ణించి సూడు."

చెల్లెలి మీదికి ఒరిగి చూపింది సిమ్మాద్రి.

ఆ పిల్ల చూపుడువేలు మీంచి చూస్తే ఆ చెట్లవెనక దూరాన ఎర్రగా నీలంగా నల్లగా జేగురుకొండ! భూమిలోంచి సగం లేచిన కొండ నదిలో సగం మునిగిన బండరాయిలా వుంది.

"ఆ కొండ కిటువంక సెట్లకి అత్తలకాదు ఇత్తలకాసి వూరుందా?— ఆ మర్రి సెట్టు కెనకాతల, కనపడదా, తెల్లిగా సత్తయి గోడ"....

చెయ్యి కదిపి ఒక్కొక్కటే చూపుతోంది సిమ్మాద్రి. బొమ్మరిళ్లలాగ చిన చిన్నగున్నాయి పెంకుటిళు "ఆఁ"... కనపడ్డంచెన్నట్టు తలూపింది దాని సెంట.

"నావిందాక సెప్పినానే తాటిపల్లి— అదిగో ఆ వూరు. ఆ వూరికెగవనుంది యెంకటాపురం. దానికీ దీనికీ మద్దిన బాలసెరువు. ఆ సెరువు కింద యెక్కడో వున్నారు మన్జులు మరి నువ్వెల్లమంటె నానక్కడ కెల్లాల."

అప్ప కళ్ళల్లోకి ఒక్క క్షణం నిదానంగా చూసింది దాలిగుంట. మొహం మీద జుత్తులు రెండు చేతులా వెనక్కి తీసుకుంది. "వద్దునే" అంటూ వెనక్కి తిరిగేసింది.

ఊరంతా ఎండలోనూ ఊరి కింద పొడవుగా నీడలూ వున్నాయి. పేట తాలూకా నీడ చెరువు కొమ్ము మీంచి చెరువులోకి పాకుతోంది. చెరువు గట్టు మీద గత్తర్లు చూసుకుంటూ ముందు దాలీ ఆ వెనుక ఆమె అప్పా జాగ్రత్తగా నడుస్తున్నారు. మొలచుట్టు తప్పిన పుట్టగోచీ మాటిమాటికీ సర్దుకుంటూ విసవిసా నడుస్తోంది దాలి.

ఏడెనిమిదేళ్ల దాలి, దాని వయసుకి చాలా పొట్టిపిల్ల. పొట్టివాళ్లకి పుట్టెడు బుద్ధులుంటాయి. అందుకే తనకన్నా చిన్నదైనా దాని సలహా తీసుకుంది సిమ్మాద్రి. కొంత దూరం వెళ్ళాక ఆ పిల్లతో అంది—

"ఇయ్యేల కాదుగాని అల్లాయేల, ముసిల్దాన్ని కిందనొడేసినారు కాదా- అపొద్దూ ఇనాగే నానెత్తే, పెద్దప్ప నన్ను సాటుకు పిలిసి, సెప్పింది— పొద్దుటేల యేంవేనైతే యెళ్ళి అల్తో సెప్పొచ్చట— మద్దేంవైతే మాటాడ కొల్లకోమంది:"

దాలి ఏంవని అడగలేదు. సిమ్మాద్రే కారణం చెప్పింది. సీటికిమాటికి పని మయాన్న పారొస్తె కూలి దండుక్కాదా! ఆళ్లకి కూలిస్తారా? ఇప్పటికిన మాటు పాటు పోనాది. ఒకల్దా యిద్దరివా ఐదుగురు పాటు.

ఓ పూట పాటు పోవడమంటే యేంపిటో దాలి వయసు పిల్లలకుకూడా తెలుస్తుంది: విసవిసా ఆడుగులేసే దాలి "అటుసూడు" అంటూ ఆగిపోయింది.

ఎదురుగుండా పెంటిగాడు! ముసిలి దగ్గర కాపుండమంటే వచ్చేసి యిప్పుడు చెరువు కొమ్మున నించున్నాడు.

"ఏంవిర పారొచ్చినా? మాంవొచ్చిందాక నిన్నక్కడ వుండమన్లేదా?" అంటూ కీచు గొంతుకతో అరిచింది సిమ్మాద్రి.

పెంటిగాడు వ ట్లాడడు, నోట్లో వేళ్లు తియ్యడు. పెద్ద గుడ్లేసుకొని మిడుతూ మిడుతూ చూస్తాడు,

"ఆణ్ణి తీసుకురాయే" అంటూ దాలికి పురమాయించి గబాగబా యింటికేసి రెండడుగులేసింది.

511

దొరికిన అవకాశం దాలి విడిచిపెట్టలేదు. దగ్గరకొచ్చి నించుంది. ఎఱ్ఱగా వాడి వంక చూసింది. గట్టిగా చీవాట్లేసింది. 'విన్నిలాక్కాదు యింటికిరా' 'అటుకాసి కాదు- యిటు'- 'నా ముందలే నడు' అంటూ దూడను తోలినట్టు తోలుకొస్తోంది. పెంటిగాడు నల్లగా బూడిదలోంచి తీసిన బొగ్గులా వుంటాడు. సున్నగా గుండు. మొలకో నూలుపోగైనాలేదు. కాళ్లనిండా దుమ్ము. అయిష్టంగా దిక్కులు చూసు కుంటూ నెమ్మదిగా నడుస్తున్నాడు.

కోతలు మొదలైన దగ్గరనుండీ మళ్లా పండుగెళ్లిందాకా పేట పేటంతా పగ లల్లా తలుపులు మూసేసివుంటాయి ఆ చుట్టుపట్ల నదుల్లేవు. కాలవలు గురించి వాళ్లెర గరు. కురిస్తే వర్షం కురవాలి, చెరువులు నిండా నీరు చేరాలి, అదును పదునూ అన్నీ కుదరాల. అప్పుడైనా అదృష్టం బాగుంటే పంట కళ్లాలకొస్తుంది, ఏ గాలివానో ఏ ఒగాదో కార్తెకాని కార్తెలో ఏ పెద్ద ముసురో పెడితే ఏఁవీ లేదు. నిరుడు లేదు మూనిరుడు లేదు. యీ యేడు కాలం కలిసొచ్చిందట. ఆకలిగా వున్నారు జనం- ఆబగా వున్నారు జనం- సంతోషంగానే వున్నా దాన్ని లోలోపలే దాచుకొని వున్నారు.

వాసకొాక ముసిల్నీ యింటి కిద్దరు ముగ్గురు పసివాళ్లనూ కాపుపెట్టి బాలాది వాడ జనమంతా కోతలకు పోయేరు.

ఒక చోట కోతలు ఒక చోట ఓగులు ఒక చోట కుప్పలు- కళ్లాల్లో నూర్పులు ఊరి జనమంతా పొలాల్లో గింజల్ని యిమ్ము చేస్తున్నారు.

కలవారి లోగిట్లో పెళ్లయితే కసిన్ని మెతుకులైనా దొరుకుతాయి కదా. అంచేత కూలీలు కూడా వాళ్ల సంతోషాన్ని పంచుకుంటున్నారు. చెప్పిన పనల్లా చేస్తూ, చేసింది తొందరగా చేస్తూ ఆ వెంటనే చేసినట్టు చెపుతూ పేట జనమంతా పెద్దవారి కళ్లాల్లోనే వున్నారు.

మూసివున్న పాత తలుపుల వంకా మొలపాతలైనా లేని ఆటపిల్లల వంకా మేయడానిక్కూడా ఓపికలేని బక్కగొడ్ల వంకా చూపులు తిప్పుతూ నడుస్తోంది దాలి. చెరువుగట్టున వెచ్చననిపించిన గాలి, వాడ మధ్య చివ్వున వెన్నులో పొడుస్తోంది. అతి యిరుగ్గా మురిగ్గా వుండే ఆ వాడలో. ప్రతి మట్టిగోడలోనూ, చలిపేరుకొని ఉండాలి, సీతాకాలపు పగుళ్లను పెద్దవి చేసుకుంటూ చలిగాలి, చావుగాలిలా వాఁ ంతటా కమ్ము తోంది.

దాలీ, వాళ్ల తమ్ముడూ కాగు చెట్టుకింది వొచ్చేసరికి —

"బానే ఓల్దాలమ్మా! బెత్తాటకొస్తావే?" అంది కోటమ్మ— "మావిద్దరఁవే వున్నాఁవు. పోనీ ఒక్క సిటం పంటలేసి ఎఁపో" అంది బతిమాలుతున్నట్లు.

512

దాలి తిరిగైనా చూడకుండా పోతూ ఆ పూట తనకు తీరదంది— పంట లెయ్యడానికీ కుదర్దు, వాళ్లు సూతకంలో వున్నారుట.

ఎవరు పోయేరని అడిగేక ఎప్పుడని అడిగింది కోటమ్మ.

"ఇప్పుడిప్పుడే యింకా ఓ సిటఁవో రెండు సిటాలో అవుతాది. అది అనాగ పోనాది— మాఁవినాగ యిటొచ్చినాం— యింటికాడెవ్వర్నేరు...." సంగతి చెపుతూనే దాలి దూరం అవుతోంది.

అలాటి భోగట్టా విన్నాక కోటకూ ఆమె తోటి పిల్లకూ ఆట మీద మనసు పోలేదు. పరిస్పరం కూడబలుక్కుని దాలి వెంట పరిగెత్తేరు.

దిబ్బసూరి జంతి దాటి ఎరకయ్యగారి గోలిలోంచి వాళ్ల వాకిట్లోకెళ్లేసరికి సిమ్మాద్రి ముంజూరు దగ్గర నించుంది.

జానడు వెడల్పు పుట్టగోచీ దోపి దాన్నే ముందుకు లాగి పయ్యాటలా వేసుకుంది. ఆమె చేతిలో పొడుగాటి వెదురుబద్దుంది.

"నానింకొక్క సిటం రాపోృతె యేటైపోనో ఏఁకా?" అంది సిమ్మాద్రి— "నారయ్యగారి కఱ్ఱి బేపినేదా— అది నాయినమ్మను పీక్కు తినీసుమ- ఉఁడమంటె పారొచ్చినాడు గుంటడు" అంటూ దిగాలు పడి చూసే పెంటిగాడివి మొట్టబోయింది.

కోటా, దాంతో వచ్చిన పిల్లా ఆ ముగ్గురు పిల్లల్నీ అబ్బురంగా చూస్తున్నారు. వాళ్లిద్దరూకూడా సిమ్మాద్రి యీడువాళ్లే: ఒకత్తె ఓ పాత గావంచా వల్లెవాటేసుకుంది, రెండోది చిరుగుల కబ్బా తొడుక్కుంది.

కొంచెంసేపు పోయేక "మాఁవోపాలి ముసిల్దాయిని సూడొచ్చే" అంది కోటమ్మ. సిమ్మాద్రి రండి అంటూ వాళ్లను పంచలోకి తీసికెళ్లింది.

వాగా కిందికుండే చూర్లో ఎత్తుగా యిరుగ్గావుండే అరుగు, అరుగునీ చూర్నీ కలుపుతూ గోనె ముక్కలూ చింకి చాపలూ మాసికలేసి దడి కట్టేరు దక్షిణపు ఎండ దడి మీదపడి పచ్చగా పల్చని వెలుగు లోపలి చీకట్లను తరుముతోంది. —

ఆ వెలుగు చీకట్లలో ఓ పాత కుక్కిమంచం. కొన్ని గోనెలూ చింకి గుడ్డలూ తప్ప వాళ్లకేమీ కనిపించలేదు. ఎక్కణ్ణుంచొస్తోందో ఘాటైన దుర్వాసన. అటు వేపేచూస్తే మంచం మధ్య ఓ ఆకారం.

తెల్లగా పచ్చగా వుండే వెలుగులో మంచానికి రెండో చివర కృశించి ఁ్రంగిపోయిన ఓ ముసలి తల. వడిలి పోయి ఉబ్బిపోయిన మొహం ఎండిపోయి[illegible]ది

513

పోయిన జుత్తు, మూతలు పడని గాజువారిన కళ్లు, తెరుచుకున్న దంతాలూడిన నోరు–చలనం ఏ మాత్రంకూడా లేదు.

వాసన భరించలేకో, భయం కలిగించే ఆ ఆకారాన్ని చూడలేకో కోటతో వచ్చిన పిల్ల "ఇంక పోదుఁవా" అంది,

అందరూ వాకిట్లోకొచ్చేరు. "మీ యమ్మా నాయనకీ కబురెట్టవా ?" అంది కోటమ్మ.

"ఎవురెల్తారు ? ఎవురెల్లినానికేనా యిక్కన్నుంచి నాలుగాఁవళ్లాల– అక్కడికెల్లీ సరికే పొద్ది. సీకటొడితే అల్దోదారీ మన్దోదారీ, దారిలో ఎదురైనా దండుగే.... అందుకే మా దాలి ఎల్లొద్దంది."

"నిజవే" అఁది కోటమ్మ.

"పోనీ యిక్కడోటోళ్ల ఎవురికైనా సెప్తేనో?" అంది కోటతోవచ్చిన పిల్ల,

"ఎవురితో సెపతాం– ఎగవీదిని మాయమ్మకో పెద్దమ్మఁది. ఐతే.... దానిక్కళ్లేనేవు, అది గుడ్డిది, దిగవీదిని లండాన లచ్చువఁమ్మ కోడలుంది. అది ముసిల్దానికేటో అవుద్దట. కాని మొన్న రాత్తిరే పురుడయ్యింది. ఎంతైన పచ్చి బాలింత యీ సల్లో శవం కాడికొస్తదా ?" అంది సిమ్మాద్రి.

అయినా చెప్పపోతే 'మాటా రావొచ్చు' అంది కోటమ్మ, ఆమెతోవచ్చిన పిల్లకూడా చెప్పడఁవే మంచిదంది.– నువ్వా- నేనా- కొంచెం సేపు వంతులాడేక దాలిని వెంటపెట్టుకొని ఆ పిల్లే బయల్దేరింది,

పొద్దు వాటారిన కొద్దీ చలిగాలి యెక్కువౌతోంది. కిందట వాకిట్లో చిఁకి చాపంత ఎండ వుండేది. ఇప్పుడది చింతమ్మగారి చొప్ప కుప్పెక్కి దాని మీంచీ పక్కనున్న యింటి మీదికి పాకుతోంది, ఎండ పట్టు ఎక్కడుంటే రోజల్లా అక్కడ కూర్చుంటాడు పెంటిగాడు. వాడిప్పుడు ఎండకేసి వెర్రిమొహం వేసుకుచూస్తున్నాడు.

"ఔనాఁ ఓరి గుంటడ! నీదుప్పటి గుడ్డేది?" అంది సిమ్మాద్రి చేతులు రెండూ పక్కలకు గట్టిగా అదుఁవుకునిగూడ కొంగలా గొంతికిలా కూర్చున్నాడు పెంటిగాడు. అప్ప మాటలకి వాడు తలైనా తిప్పలేదు. ఎండ పోయినా ఆ పట్టు వెచ్చగా ఉన్నట్టుంది. కదిలితే చలేస్తోంది.

514

వాడి దుప్పటి గుడ్డ వెతకడానికి సిమ్మాద్రి యింట్లో కెళ్ళింది. తలుపుతీస్తే అంతా చీకటి. పచ్చగా మెరిసే యిత్తడి బిందిలాంటిదైనా లేదు. ఉట్టెలు చట్టెలు కుండలు మండలు చివరకు గుడ్డముక్కలు సహితంగా నల్లగా ఆ చీకట్లో కలిసిపోయేయి.

తడుములాడుతూ వెతికి తమ్ముడికోసం మళ్లా కేకేసింది సిమ్మాద్రి. గుంటడు మొద్దునాపలకడు. కోపంగా యివతలికొచ్చి చూస్తే పెంటిగాడు నాయనమ్మ మంచాని కెదురుగా నించున్నాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది సిమ్మాద్రికి. చస్తూ చస్తూ ముసిల్ది చలి సంకటంతో సచ్చింది.

ఏవయ్యిందంటే—

... అంబళ్ల వేళకి పిల్లలిద్దరికీ కసింత కసింత ఒడ్డించి తనూ కొంచెం పెట్టుకు తింది. కాచి అట్టి పెట్టిన నూకజ్జావ తీసుకుని ముసిల్దానికి పట్టడాని కెళ్ళింది. ఒంటి మీద ఒక్క గుడ్డ ముక్కైనా లేదు. ముసిల్ది యీ లోకంలో లేదు. ఎముకలూ చర్మం, వజ వజ గడ గడ చెడిపోయిన మోటారింజనులా కొట్టు కుంటోంది. తల నుండి పాదాల్దాకా కింద పక్కగుడ్డలు తియ్యబోతే నీరుడుతోనూ, చెరువుల్తోనూ తడిసున్నాయి. ఇంట్లో కనపడ్డ గుడ్డ ముక్కల్లా కప్పింది. తడి గుడ్డలు కూడా కప్పింది. దాలీ పెంటిగాడూ పరుచుకునే పాతగోనెలు చింకి బొంతలూ మీద పడేసి గట్టిగా పట్టుకున్నారు. ఎంత చేసినా ముసిల్దాని చలి ఆగలేదు.

పళ్లు గట్టిగా కరిచిపెట్టి, పిడికిళ్లు రెండూ బిగించేసి, ఊం.... వజ వజ వణికి పోతోంది. మెత్తగా తోలుతిత్తిలా వుండే ముసిల్ది ఎలా అయిపోయిందో, గట్టిగా యినప్పొమ్మైపోయింది. పావుగంట నానా హైరానా పెట్టి టపీమని పట్టొదిలేసింది. తరువాత మూడు చెక్కలు చెక్కడానికి తెరిచిన కళ్లూ నోరూ అలాగే వుండిపోయేయి.

"కోటమ్మా! శవంకాడ గుడ్డ అంటుకోవచ్చే?" అంది సిమ్మాద్రి.

కోట జవాబివ్వ లేదు. సిమ్మాద్రికి గుండె గతుక్కు మంది. రాత్రి తొంగుందికి ఒక్క గోనెగుడ్డైనా లేదు. అన్నీ శవం మీదేఉండి పోయేయి. ఇంట్లో యేవంటారో. "శవాన్నింకా దించనేదుకదా! ముడితె తప్పా?" అంది వాకిట్లోకొచ్చి.

'నాకు తెల్దు. పెద్దోళ్ళొస్తె తెలియాల' అంది కోట.

సిమ్మాద్రికో చిన్న ఆలోచనొచ్చింది.

515

'ఎప్పుడనగ ఎల్లినారు, యింకా రారు పిల్లలు!' అంది బెంగపెట్టుకున్నట్టు.

'నానెల్లి పిలుసుకొద్దునా?' అన్లేదు కోట. 'మీయమ్మా బాబు వొచ్చిందాక మీరిలాగుండ గల్దురా?' అంది కోట.

'ఉండకేటి సేస్తాం! ఎందల పడి పోతాం వేటి?' అంది సిమ్మాద్రి.

అన్నప్పటి పేడి తగ్గగానే అనుమానం వేసింది. తను ధైర్యంగానే వుండొచ్చు. పిల్లలు భయపడొచ్చు. మన నాయినమ్మేనరా! అని వాళ్ళకు ధైర్యం చెప్పాలి.

ఆపైన ఆలోచించడానికి మనసు ముందు కెళ్ళలేదు.

పొద్దు బాగా వాటారింది. నీరెండ నేలవిడిచి చెట్లమీద అల్లల్లాడుతోంది. చెట్లమీద పొంచున్న చీకట్లు క్షణంలో దాన్ని ఫలహారం చేసేయి.

గోర్జలో దుమ్ము రేపుకుంటూ అడవికెళ్ళిన ఆలమందలు ఇళ్ళకొస్తున్నాయి.

'పశివిలొచ్చేసినాయ్. మా యప్ప పేడకెల్లింది, నానింటి కాడ నేప్పొతే తిటంటాదో' అంది కోటమ్మ.

ఎంత సేపై అలాటి మాటకోసం వే ఎదురు చూస్తోంది.

'ఐతే ఎల్లిరా' అంది సిమ్మాద్రి—

ఆ పిల్ల గోలి మలుపు తిరగ్గానే దొంగలా చూరులోకి దూరింది. లోపలంతా చీకటి. శవం మీద గుడ్డలు ముట్టటోయేసరికి వెన్నులోంచి దడొచ్చింది.

మీద మీదవి కొన్ని నొల్లుకొని రెండడుగుల్లో బైటికివచ్చేసింది. వెలుతుర్లో ఒకొక్క గుడ్డా చూసి మడతలు పెడుతోంది.

దాదాపు అన్ని గుడ్డలూ తడితడిగా పొడిపొడిగా వున్నాయి. గొంగళి పురుగులో రోకలి బండలో పట్టిన గుడ్డల్లా చూసి చూసి దులిపి దులిపి మ డ త లు పెడుతోంది.

....పెంటిగాడి దుప్పటిముక్క అంచుదగ్గర అంగుళంమేర బాగా మైలయ్యింది ఎవళ్ళో అడుక్కొని మొన్ననే తెచ్చేడు నాయిన, బాగా గట్టిగుంది పోతాదేవో?— ఆమేరకి చీరి పారేసి మడతలు పెడుతోంది.

చూర్లోంచి పెంటిగాడు ఎప్పుడొచ్చేడో కళ్ళు పెద్దవి చేసుకుని ఎదురుగా నించున్నాడు.

'నోట్లో ఆయేష్లు తియ్యరా– నిన్ను గుమ్మట్లో కూకోమన్లేదా?' తనకే భయమేసేటంత గట్టిగా అరిచింది సిమ్మాద్రి.

పెంటిగాడు తలవంచుకొని దడదడ గుమ్మంలోకెళ్లిపోయేడు. ఒంజి పెట్టిన గుడ్డలూ, గోనెలూ తీసుకొని సిమ్మాద్రికూడా వాడి వెనకనే వెళ్ళింది. తమ్ముడు ఎప్పుడూ కూచునే స్థలంలోనే ఉండచుట్టుకూర్చున్నాడు.

తను తెచ్చిన గుడ్డల్లోంచి ఒకటి తీసి తమ్ముడికి కప్పబోయింది. ఎందుచేతో మనసొప్పలేదు. లోపల కావిడిపెట్టి అడుగున తల్లి యింకొకందుకు దాచిన చింకి కోక తీసుతొచ్చింది. సగం పరచి వాణ్ణి పడుకోమంది. మిగిలిన సగం వాడిమీద కప్పింది.

చలిగాలి రివ్వున వీస్తోంది. తను కూడా కప్పుకోవాలి, ఆ గుడ్డలు తప్ప యింకేమీ లేవు. ఆలోచిస్తుంటే దాలి పరిగెత్తుకొచ్చింది.

"అమ్మా నాయినికి కబురెల్లిందే అప్పా– దిబ్బమీద కిల్లీ బడ్డీ నేదా. అక్కడోటు ఓ నాయుడున్నాడు. ఆయన్తో కబురు తోల్నాను."

"ఉహూహూ" అంటూ అక్కడున్న గుడ్డతీసి ఒళ్ళల్లా దగ్గిరిగా కప్పుకుంది దాలి. ఎందుకు కోపమొచ్చిందో సిమ్మాద్రికి కోపం వొచ్చింది.

"సూసిరమ్మంటే కాల్చొస్తాది పిల్ల. నానెక్కడికెల్లమన్నాను– నువ్వెక్కడకెల్లినావు. లచ్చువమ్మ కోడలకి సెప్పనేదా?" అంది దీర్ఘాలు తీస్తూ.

"సెప్పినాను. ఏటి సేస్తాం, ఒల్లకోండంది.– అప్పుడా దగ్గులోడునేడా– ఆదే సెప్పినాడు– టీకొట్టుకాడ ఎంకటాపురం మనిసున్నాడు బేగెల్లమని....

ఆ తరవాత ఆ మనిషికోసం వాళ్లెక్కడెక్కడ తిరిగేరో, చివరికాయన ఎలా దొరికాడో– అదంతా దాలితో వెళ్ళినపిల్ల, పదిలంగా వివరంగా చెప్పుకొచ్చింది.

అంతా అయ్యేక "యింక నా వెల్దునా?" అంది చేతులు రెండూ గుండెలకానుచ్చుకొని చలిని సూచిస్తూ.

"నీ యిష్టంవే. నీకు పనుంటె యెల్లు. నేపోపైతె తోడుండు." అంది సిమ్మాద్రి స్నేహంగా.

దాలి మాత్రం "ఉండవా? ఉండవా?" అంది–

నీలమ్మ సంతోషంగా ఉండిపోయింది.

* * *

దొంగరేయి దాకా ఆకబురూ యీకబురూ చెప్పుకుంటూ అలా అమ్ముగ్గురూ ఆ గుమ్మంవార గోడకు అఁటి పెట్టుకూర్చున్నారు.

నడి వాకిట తెల్లగా వెన్నెల. నట్టింట్లో నల్లగా చీకటి. చూరు పంచలో ముసిల్దాయి శవం. బయట ఊరూ దేశం చెట్లూ చేమలూ డొంకలూ దొరువులూ సన్నని మంచు వానలో సందడి లేకుండా తడుస్తున్నాయి.

* * *

పొద్దల్లా ఒంచిన్నడుం ఎత్తకుండా పన్చేసి పొద్దు పోయాక్కూడా కొంత సేపు పన్చేసేరు. సందవేళ పని ఆగింది. నడవ్వలసేది నాలుగాఁవఁళ్ళు. చలిలో వెన్నెట్లో కూలీలు చకచకా అడుగేస్తున్నారు.

పాతికదాకా ఆడాళ్ళు, పదీ పదిహేనుమంది మగాళ్ళు, భుజాలమీద కొడవళ్ళు, చేతుల్లో చద్ది ఉట్టెలు, గిలుకూ గిలుకూ చప్పుళ్ళతో పనిమీద కదిలే చీమల బారులా పరుగువెనకే నడకా నడకలందక పరిగెడుతున్నారు.

"ఓరెవర్రోయి కూలీలు! అక్కివరం కూల్లేనా?"— అన్నాడో దుప్పటి మనిషి.

ఎంకటాపురం నాయుడు గొంతు! 'అవును బాబ'న్నాడు మేస్త్రీ.

"ఎరకయ్యట ఎవుడ్రా. ఇందలున్నాడు?"అన్నాడు నాయుడు.

"బాబ్బాబున్నాను." ఎరకయ్య జట్టులోంచి ఒసల బోయేడు:

వెనుకనేవున్న సాఁవాలు ఆపిఁది "ఏఁవిగదా"అంది నాయుడికెదురై. ముందు వాళ్లు ముందు, వెనుక వాళ్లు వెనకా. ఎక్కడివాళ్ళక్కడే ఆగిపోయేరు.

"ఇంటికాడ- మీయత్తో- అమ్మో- ఒక ముసిల్దాయి ఉందేటి?" అన్నాడు నాయుడు.

"ఆఁ ఆఁ.... వుంది బాబు మాయమ్మే"అన్నాడు ఎరకయ్య.

'ఉస్-ఉండు' అన్న సాఁవాలు మాటలు అతడు వినిపించుకోలేదు.

"బేగెల్లండి. ముసిల్దానికి సుకం లేదు. బేగెల్లండి"అన్నాడు నాయుడు.

"ఏటి— పోనాదా?" అంది సాఁవాలు. నాయుడు కోపం తెచ్చుకున్నాడు.

"పోప్పోతే యెల్లపేటే? కాదు పోప్పోతె యెల్లవా?... నత్తా నాఁవా పిల్లలమీద సావనున్న ముసిల్దాన్నొగ్గేసి తల్లి నలుగురూ తగలడాలా? కాదు— కిడుపు జాక్కా ఎల్లినారు— ఏం ఒకళ్లు ముందొస్తె తప్పా!"

518

నాయుడు మందలింపు సాగుతూనేఉంది. సాఁవాలు కంతా అర్ధమైపోయింది. నెత్తిమీదున్న వడ్ల మూట తీసింది. పక్కనే వున్న పెద్దకూతురు కెత్తింది. దాని చేతిలో వుండే చద్ది మూట అడిగితే అది పరవాలేదు ఉండనిమ్మంది.

"ఏఁవింక కదలవూ.... మత్తోదల్నేదా?" అంటూ యింకా నిలబడే వున్న మొగిణ్ణి గదిమింది.

పని ఆపీ ఆపకముందే ఇదిగిప్పుడోస్తాఁవంటూ ఊళ్లోకెళ్ళిన మొగాళ్లు కల్లు పాకలో దూరేరు. తాగినందుకే కాదు. ఎందునా పొందని జాలం! ఆడవాళ్ళంతా అగ్గి మీద గుగ్గిలాల్లా వున్నారు. అది గ్రహించి—

"పదపదోస్ పదండ్రా" అంటూ ఎరకయ్యని తోలుకొని ఆ జట్టు కొందరు బయల్దేరేరు. సాఁవాలు కూడా వాళ్ళతో పరుగందుకుంది. రెండడుగులేసి కొడుకేడంది. ఆ కొడుకు అందరికన్నా ముందరే ఉన్నాడు.

"నాను కూడా వోద్దునేఁటే?" అంది చిన్న కూతురు నారెమ్మ. జవాబు రాపోవ్వేసరికి "అయితెల్లే" అంటూ జట్టుతోనే వుండిపోయింది.

అక్కడికి అక్కివలస యెంతో దూరంలేదు. గోర్జ కొసంటు కొచ్చేసరికి వెనకనుండొచ్చింది అంకాలు.

"అవునె పోలమ్మా ముసిల్ది పోనాదన్నాడా? జబ్బు మోపు గుందన్నాడే?" అంది అంకాలు.

"ఏ కబురూ సెప్పనేదు- ఏ మాత్రం పోయే వుంటాది, నాయుళ్ళు సావు కబురు సెపతారా?" అంది పోలమ్మ.

"నానెప్పుడో సెప్పినానే— అటు కోత లిటు పండుగు— అన్నీ కుదిరిన్నాడే ముసిల్దాయి కదుల్తాది. అందాక యిది కదల్దన్నాను, నానన్నట్టె అయ్యింది."— అంది నారెమ్మ.

మధ్యలో "నోరుముయ్యే" అన్న పోలమ్మ మందలింపు ఆ పిల్ల చెవికెక్కల్లేదు. టిక్క చెరువు గట్టెక్కేసరికి ఊరెదురుగా కనిపిస్తోంది.

"ఎంతరేత్తిరెంత రేత్తిరయ్యింది. ఈదిల శవాన్నెట్టుకుని యింటికాడ పిల్లలేం బెగిలిపోతన్నారో"— ఆ శవాన్ని తియ్యడఁవెప్పుడు, ఆ తరవాత అగ్గులెయ్యడఁవెప్పుడు! మళ్ళా సీకట్నె నెగాల!" అంది ముందు నడుస్తున్న ఆడ మనిషి.

"తాగుమోతు సంత- దీంతో బయలెల్తె రాత్తిరి కాదా"- అంది ఆమెకన్నా ముందున్న పిల్లల్లి.

"ఏటి సెయ్యమన్నారత్రా, సలీ" అంటూ సర్దుకు రాబోయేడు మేస్త్రీ.

గుగ్గిలాఁలన్నీ ఒక్కసాది భగ్గ్‌మన్నాయి.

"సలి మీ మొగాళ్ళకే గాని మాకుండదేట్రా మాఁవా"— మీరే మడుసులు గాని మాం కాదేట్రా ?

"కాదు ఇంటికాడ ఎలాగా తప్పదు. దార్లో కూడ తాగాలేట్రా ?"—

కదిపితే కందిరీగల పుట్ట. ముయ్యాలేడు – తోలాలేడు. నోరు మూసుకు ఊరుకున్నాడు మేస్త్రీ. ఊరంచు కొచ్చేక నారెమ్మ అడిగింది–

"జానపే ముదరదానా ! మనిసి సచ్చిపోతే ఏఁపేటి సేస్తారే ?" అంది వెనక వస్తున్న మనిషితో.

"ఏటి సేస్తారు. సచ్చిన్నాడు కాలుస్తారు దినవారాల్నాడు తిళ్ళెడతారు."

"సరీగ సెప్పే. ఏఁపేటి కరుసులౌతాయి ?" అంది నారెమ్మ.

"ఎట్టినోళ్ళ కెన్నేనే అవుతాయి. ఇప్పుడు నాలాటి దాయి సచ్చిందంటే నలుగురూ పూసై, నాల్దబ్బులెత్తి శవాన్ని అనిపీడంతోసరి కనుక్కున్న బిడ్డ పాపలో, కట్టుకున్న మొగుడో, తోడబుట్టిన అన్నదమ్ములో. వుంటె దానికి పదో పాతికో ఆళ్ళ కలిఁమిని బట్టి దినవారాల్నాడు తిళ్ళకనీ– తాగుడకనీ అవుతాది.–"

అఁదాకా అందిన భోగట్టా చాలు–

"గోయిందా– నా సీఁవెండి కడియాలు గోయిందా !"– అంది నారెమ్మ.

"సీఁవెండి కడియాలేఁపే ?"– ఎవరో అడిగారు.

"తిన్నగుంఁటావ తన్నమన్నావా ?" అంది పోలమ్మ.

*　　　*　　　*

దండప్పిగాడు, పేట నాలుగు వీదులూ తిరిగి పదిమందినీ పిలుచు కొచ్చేసరికి జాఁవున్నర రాత్రయ్యింది– పొగ మంచు యింకా కురుస్తోంది, పేట మధ్య వేపచెట్టు మీంచీ మసక చంద్రుడు బారెడు పైకి లేచేడు.

"మరేట్రి ఎరకయ్యా– యింక సూసీ వోఁటా– సేసీ వోఁటా ఎవరు నేరు కొఁటట్టు ఏదో ఓ యేళకి యీ రాత్రికే అనిపిస్తె కాదా, అంటారు మనోళ్ళు నలుగు

రన్నారనే కాదు— నా బుద్ధికీ అదే మేలుగుంది. పేనఁవా ఎప్పుడో రెండు జాఁవుఁకి పోనాది. ఇప్పటికే అంటుకు రావాల, రేపొద్దున్నదాకుంటె ఏటగునో?''— అన్నాడు సూరయ్య.

కుల పెద్దలు నలూఁగురూ నాలుగు చొప్పకర్రలు పడేసుకుని వాకిట్లోనే కూచున్నారు. తక్కిన వాళ్ల దగ్గిరా దాపలా చూరు పంచల్లోనూ సర్దుకున్నారు, ముంజూరికి కొంచెం ఎడంగా శవాన్ని పెట్టుకొని— ఎరకయ్యా అతడి భార్య సాఁవాలూ కూర్చున్నారు.

''శీతగాలి కాబట్టి ఆ పాటేన కాసింది.'' అన్నాడు బారికి కన్నయ్య. నేపోఁతె ముక్కూ నోట బొక్కలన్నీ నీళ్ళు కారేసి. ఇనాగ— ముట్టుకుంటె పొట్ల పండు నాగ— ఇచ్చిపోతాది శవం.

''జీవుడు పోనాక కాల్పనానికి నాలుగైదు జాఁవులు దాటకూడదు— దాటితే కట్టె నిలవదు.''

కన్నయ్య చెప్పేదంతా నిజంకాక పోవచ్చు కాని కొంత వుంది. కొడుకూ కోడలూ వచ్చేసరికే శవం కొంత పాడయ్యింది.

ఆదరా బాదరా పరుగెత్తుకొచ్చిన జనానికి యిల్లిల్లా చీకటి యింటి గుమ్మంలో బెగిరి కూర్చున్న పిల్లలూ కనిపించేరు. తలుపులేసి గబగబ బుడ్డి దీపం వెలిగించి యివతఁకి తెచ్చేరు. చూస్తే ముక్కు రంధ్రాల్లోంచి నోటంబడి చీఁవలూ, నీళ్ళూ. ఎక్కణ్ణుంచి వచ్చేయో పుట్టఁకి పుట్టలు— చీఁవలు పట్టేసేయి, గబగబా వాటిన్నిట్నీ దులిపేసేరు. వాకిట్లో చూరుమీంచి గోనె గుడ్డల దేరా కట్టేరు, కింద గడ్డి పరిచి అందు మీద శవాన్ని పడుకోబెట్టేరు.

ఆ నీళ్ల కారడం ఆ దుర్వాసనా అన్నిటితో అలాగే తలదగ్గర కొడుకూ కాళ్ళ దగ్గర కోడలూ కూర్చున్నారు.

''సరే. యిక కాస్తాదో కాయిదో ఆ సంగతంతా అలాగుంచు.'' అన్నాడు రాజియ్య ''సచ్చిన ముసిల్దానితో ఉన్నోళ్ళం సావనేం కదా? లండానోళ్ళ జట్టు పొద్దు దూరీ సరికి బయలెల్లాల. మాఁవూ సిటం యిటో అటో అయేలకే బయల్దేరితేగాని మామ్మోలు ఏలకి తాటి పిల్లి సెర్నేం. ఆ పూర్నాయుడూ అసలే మూకానోడు. పని పూర్తైతే గాని యియ్యాల్నాగే కూల్లియ్యడు. ఇంక మూరా బారా పని మిగిలి పోయిందంటె, ఎల్లుండి బొద్దాం కాపులికి ఒస్తాఁవన్నావు— ఆ మాట పోద్ది.''

రాజియ్య మాత ముప్పిడి లేకండా యదార్థం తిన్నగా చెప్పేడు —

నిజంవే, ఎరకయ్య సదుపాయంకోసం చూస్తే పేటపేటందంకీ ఓ పూట పని పోతుంది. మాకారం— గంగినేనిపల్లి కూలీలున్నారు. పీళ్ళోరోజు అ న్యం చేస్తే వాళ్ల తన్నుకు పోతారు, ఎవరెంత నొల్లుకున్నా యింకో వారం పది రోజులే.

"మీరందర నాగాగంటె మాం మాత్రం కాదంటావా? అనాగే అసిపీదుంవు. ఎక్కడేనా నాలుగు సందిళ్ల కఱ్ఱలు సూడండి," అంది సావాంలు— శవం మాకూ్కా వోరూ తుడవాడానికి ఆమె మధ్యమధ్య లేస్తూనే వుంది

ఆ మాట అనీసరికి మరెవ్వరూ మాటాడ లేపోయేరు. కొంతసేపు పోయేక సాంవాలే అంది.

"కావిడి కఱ్ఱలు— సాలవంటె రెండు కావుళ్లు— పోనుత్తిగాదు కరీదుకు దొరికినా మాబాగే— ముసిల్దానికెంత కావాల—. దుమ్ములూ శరమం తప్ప యింకేటి మిగల్నేదుకాదా." అంది సాంవాలు,

కఱ్ఱలకోసం సాంవాలు అంత పట్టుపట్టడం కొందరికి బాగులేదనిపించింది. అందులో, ఆడవాళ్ళకి:

"ఎం, కఱ్ఱలు రాపోపోతె శవాన్ని కదపవేటి?" అంది లచ్చుంవమ్మ.

"ఎలా కదుపుతావూ?"

"ఏం కిరియా సేసేస్తె కాదా?"

సాంవాలు మాటాడలేదు.

"—కాదు నీకెప్పుడో కఱ్ఱల్దొరికిందాక శవాన్ని తియ్యనంటె— యీ రేత్తిరి— సిన్నాపెద్దా— అంతా పస్తేకదా— రేపు రెండు జాంవుల్దాక పొద్దల్ల తిండీలేని జనం— సిన్నపిల్లలు, పురటాళ్లు ముసిలీ ముడగా ఈళ్ళంత అలాగ పల్లిగం గడుసుకొని ఉండగల్తురా?"— అంది లచ్చువంమ్మ.

లచ్చువంమ్మ నోరు మంచిదికాదు, దానికి తోడు ఆమె వాదానికిప్పుడు బల ముంది. ఎండాకాలం నాలుగు నెలలూ యే మూలకెళ్ళినా కఱ్ఱా కంపా ఆకూ అలం ఎంతో కొంత ఎవరికైనా దొరుకుతుంది. అలటి రోజుల్లో యిలాటి అపదొస్తే నలుగు రిళ్ళల్లోనూ నొల్లితే నాలుగు సందిళ్ళ కఱ్ఱలు సుళూవుగా పోగు చెయ్యొచ్చు. పొయ్యి మీదకి దొరికే యీ రోజుల్లో పొయ్యి కిందికి దొరకటం పెద్ద గగనం. యిప్పుడల్లా వేరుశనగ రొడ్డా గంటీ కఱ్ఱలూ కంది కంపా యిపే పొయ్యిలోకి

అలాటప్పుడు మనిషిని కాల్చడానికి సరిపడ కర్రలెక్కడ దొరుకుతాయి.

"మరి మాం మాత్రం ఎందల పడిపోతాఁవప్పా. కాల్సనానికి కర్రల్లేవని కిరియా కొప్పేసుకుంటే మాయాడ బొడుసు లూరుకుంటారా? రేపొద్దున్ననీ కోడలే అంటాది— అత్తముండని కాల్సనానికి దీవి మొకానికి అగ్గేనా పుట్టింది కాదు. గొయ్యి తీసి కప్పెట్టేసింది.— పొద్దుటి దాక ఆగితె కాదా— అంటాది. ఎపెల్లినా నాలాటోళ్లకి కొయ్యే కదా." అంది సాఁవాలు.

మాట మధ్యలోనే లచ్చువఁమ్మ అదో కారణం కాదన్నట్టు తోసి పారేసింది.

"— ఆఁ అంటాది. ఇప్పుడు సస్తె దానత్తని కాల్సడానికి దానికాడ కర్రలు కూకున్నాయి. నీకాడ లేపోనాయి. ఆనీ లెంజనెవలనో పుట్టెడు కర్రలు అప్పిమను— అప్పుడు తెలిసొస్తాది."— అంది లచ్చువఁమ్మ.

"పోనీ ఓ పన్నేస్తేనో" అన్నాడు పొరుగింటి సొట్ట పాపిగాడు "రేపొద్దున్న యాపగించీదేదో యిప్పుడే యాపగిస్తే కాదా?" అన్నాడు ఉభయ తారకంగా,

నిజమేకాని పొద్దున్నకీ ఆ అర్ధరాత్రికీ తేడా ఉంది, యీ చలిలో అర్ధరాత్రి ఎవరి తలుపని కొడతారు. అమ్మకానికైతే పోనీ అపద కాబట్టి లేపొచ్చు. ధర్మానికడుగుతూ అర్ధరాత్రి కలుపు కొడితే ఎవరైనా ఏమంటారు!

"ఈ యేలప్పుడు పని జరగాలంటె ఒక్కటే ఉపాయం— కన్నయ్య మాఁవ కదలాల. ఎంత లేదన్నా బారికోడు కదా, ఆడు ముందలుంటే ఎవులూ తన్ననానికి రారు.— అదే ఉపాయం." అన్నాడు మళ్లా సొట్ట పాపిగాడే—

సొట్ట పాపివాడి ఆలోచన అందరికీ బాగుందంటే బాగానే ఉందనిపించింది. సామాలు కూడా "సూరన్నా రేపొద్దున్నేనా, యిప్పుడేనా, నువ్వే పూనుకోవాల. మరి మాకేటి యిరస్తా పరస్తా? మరి మీ బావకెవ్వరు పలకరు— నువ్వేరగవేటి?"— అంది నువ్వే దిక్కన్నట్టు—

....కన్నయ్య "తప్పు తాదేటి పదండి." అంటూ కర్ర తీసుకొని బయల్దేరేడు,—

బారికాయన కర్రలు అడగడఁవంటే అడుగుతాడు. కర్రలు మోస్తాడా— అందుకు నలుగురు మనుషులు కావాలన్నాడు.

సొట్ట పాపిగాడూ— ఎరకయ్య పెద్దకొడుకూ, పొరుగింటి సీతయ్యా ముగ్గురు లేచారు.

‘‘ఇంకోణ్ణి నీకన్నా కాస్త జబరుగున్నోణ్ణి సూడు.’’ అన్నాడు బారిక్ష న్నయ్యా

‘‘అప్పారావుని నేపుకొద్దునా?’’ అన్నాడు సీతయ్యా.

‘‘అడొస్తే.... అడిగినావా మీరెవ్వరు రాపోయినా పరవానేదు. కాని ఆడితో ఓ తగువు. అసలాడు వెగుస్తాడా యీ రాత్రేల!’’

‘‘నీకెందుకు నువు నడుదూ, నానాణ్ణి తెస్తాను గదా,’’ అంటూ నిబ్బరంగా పక్క సందుకేపి నడిచేడు సీతయ్య, బారిక్కన్నయ్య. అతని వెనుక మనుషులూ ఊరికేసి కదిలేరు.

* * *

“ఈ సచ్చిపోయిన ముసిల్దాన్ని ఇంతప్పణ్ణుంచీ నానెరుగుదును”— అన్నాడు సూరయ్య.

ఆ పల్లెటూళ్ళలో శవాల దగ్గిర భజనలుండవు. ఈ కులానికీ ఆ కులానికీ లా, వాళ్ళ శవాల్దగ్గర అగర బత్తీలు వంటి సుగంధ ద్రివ్యాలుండవ్. ఎంతైనాకానీ ఖర్చు అవసరంలేని మాటలూ, కన్నీళ్ల తప్పితే —ఆ శవాలు కదిలే వరకూ యింకే ఖర్చూ అవసరంలేదు.

సూరయ్య వయసులో పెద్దవాడు. ఊరి ఊరందరి కథలూ ఎరుగును. ఆ పేటవారి బ్రితుకులన్నీ అతడి కళ్ళ ముందు నడిచేయి.—

సూరయ్య చెప్తున్నాడు—

“నానిదిగిలాగ యింతున్నప్పుడు. మాయమ్మెన కొతల మా తాతగారూరు తరుచూ యెల్లోణ్ణి. మాయమ్మ యింటి కొక్కతే ఆడపిల్ల. దాని కన్నోరి వూరూ యిది పుట్టినూరూ ఒక్క టే; తంగుడు—బిల్లనీ, కూర్మాం కెళ్లేదారినేదా, అక్కడ అంపోలుకి కోసెడు దూరాన వుంటాది. మనూరికన్న మరి పద్నెక్కువే వుండొచ్చు. మాలపేట దీన్లో సగంవే వుంటాది. మా తాతగారిల్లూ దీని కన్నోరిల్లూ ఇలా గలాగ ఎదురూ బొదురుగుండేవి.

“నానింతున్నప్పుడు— యిది ఇలాగ యింతుండేది. దీన్నందరూ, ఒలే పొట్టి నారెమ్మ! ఒలే గచ్చకాయ! ఓలె గొట్టిపిక్క! అని ముద్దుకి రకరకాలుగ పిలసీ వోరు. ఇప్పుడీళ్ల కడసారపు గుంటనేదా— దాన్లాగే లిడుకూ— లిడుకూమని తిరుగు తుండేది.

524

"నాకు దాగ్గేపకం. యెండకాలం యెన్నెలరాత్తుళ్ళొస్తే పెద్దోళ్ళందరూ విద్ద రోయినా యెంత రద్దు మా గుంటలంతొంగునీ వోళ్ళంకాఁవు. కబుర్లయీ సెప్పుకుం డోల్లం— ఆటలూ పాటలూ మద్ది మద్దె కయ్యాల్తో ఓ గొల్లుమనీది యీది. అయితె అప్పుడు అరెవురో నానెవురో— సంతల సింతపండునా గుండీది.

"ఇది గిలా గుండగా ఓపారి యీ జట్టు జట్టంతా తాటి ముంజలు కోసం పెందెలంటపడ్డారు. ఏడెనమండుగురు మొగపిల్లలూ నలుగురైదుగురు ఆడ పిల్లలూ రెండో మూడో గడ కర్రిలూ....

"అయితె అప్పటి నాయుళ్ల యిప్పట్నాటి కరువుగొట్టు నాయాళ్ళ కారు. 'ఆపు' ఉంచిన పెండికెళ్ళినా, ఏదో పేదారోదా, కడుపు జరగని గుంట పాపల్నెమ్మని సూసీ సూణ్ణట్టు ఓ కసురు గసిరి ఒగ్గిసివోరు.

"పది పన్నెండు పెందెలు తిరిచీసరికి పొద్దు తిరిగి పోనాది. అందరికీ కడుపుల్నిండినాయి. కాని ఒళ్ళల్లా బంకే, సేతుఁల్లా తెఁవదే. ఎండపళ్ళన్నీ మావేనేఁవో యీవలట్టి పోనాం.

"అప్పడలా గొస్తంటే— అక్కడ తోవలో గొల్లల పాలెఁవని యింకో వూరుండేది. అవూరు దాట్నాక, యిక్కడ మన కాఁవడికోనేర్నెదా, అలాటిదో పెద్ద 'బంద' తగిలింది.

"మాకు తెల్దు. అందల గేదల్ని కడుగుతారని— నీళ్ళు దొరికిందే సాలు. ఏ నీళ్ళైతేం మాకందరికీ పోయిన పేనాలు తిరిగి దొరికినట్టయ్యింది. పొలో మంటూ ఆ గోసిగుడ్డలా గట్టుమీద యిసిరి పారీసి అందరిఁవీ నీళ్ళమీద పడ్డాఁవు.

"అయ్యా! దిమ్మాదిరగా తానాలాడి నీళ్ళల్లా కెలికిలెట్టేసి గట్టు మీది కొచ్చి సూదుఁవూ జలగులంటుకున్నాయి. గజ్జలంటా, యీపులమీనా, కాళ్ళకాడ యిక్కడక్కడనకు— ఒక్కొక్క గుంటకీ గుంటపావడికీ రెండేసి మూడేసి జలగలంటేసినాయి.

అందలీ నారెమ్మకి సరీగ్గ మానమ్మీదట్టుకుంది. యిఁత జలగ—

"మాకు తెల్దు— ఓలమ్మంటె ఓరిబాబో ఓర్నాయినంటె ఓరయ్యోఅని ఎవరి జలగలు సూసుకొని అళ్ళఁపే గెంతుతున్నాఁవు.

"తల్లి ముండ మోసిన జలగలు పట్టుకుంటె ఒకంతటగ్గా సూడిరావు—— యీడవు— ఎలాగైతేనేం ఒకళ జలగల్ని ఒకళం ఒలుసుకొని అరకతాలన్నీ మళ్ళీ నీట్లో సుబ్బరంగ కడిగేసుకొని సివరకి బయలెల్లినాఁవు

525

"మొగ పిల్లలంత కదిల్నారుగాని యీ ఆడపిల్లలుకదటరి. ఏవ్రా? 'ఒస్తాం మీరు ముంగల నడవండి.' ఆడపిల్లిలుకదా ఏదో గోపిగుడ్డలు పిండుకుంటారు కావోలని మేం పదండంటే పదండన్నాం.

"పదిబారలెల్లి ఎనక్కి సూస్తే ఒగ్గుంటా కానారిదు. అందల పెద్దోళ్ళు ఏటి పంగతో సరీగ్గ సూసిరండయ్యా"అని మా బావనీ నన్నూ తోల్నారు.

"మా వెల్లీసరికీ, యినాగ్గేది పడ్డలు సూసినా, ఏఁవేనొస్తే అన్నీ ఒక్కాడ దగ్గిరైపోతాయి, అనాగ యీయాడపిల్లలందరూ ఒక్కాడైపోయి బిక్కుబిక్కుమంటూ దిక్కులు సూత్తన్నారు.

"మా బావని సూడగానే యిప్పుడు మా ఆడదాయినేదా, అప్పటికి మా పెళ్ళి కానేదు, దాన్ని మా కాడకి తోల్నారు, అదొచ్చి అతి రగస్సెంగ యిదిగినాగని ఆళ్ళన్నకి సెప్పింది,

మా బావగదా, ఓరిబాబు! కొంపలంటుకున్నాయని ఆళ్ళందర్నీ పిలుసుకు రానానికి తయారైనాడు. నాను ఆణ్ణాపి, మరేం బయ్యంనేదని దైర్యంసెప్పి ఆ సుట్టు పట్టంత ఎతికించినాను. ఒక్కాడ ఒక్కొత్త సుట్టపీక దొరికింది, అప్పుడు దాన్నే నీట్లో సుబ్బరంగ కడిగేసి కసాబిసానవిలి ఆ రసం ఓ తాటి దొప్పలోకి పట్టినాను. అది మా ఆడదాయికిత్తే ఒట్టుకెల్లి ఆ జలగ మీదోసింది, అప్పటికిడ్డాది జలగ.

"అయితే, అది నగాయితు, ఒంటిగ నానెప్పుడు తారసపడ్డా ఇదిగిలాగ తలొంచుకు తప్పుకునీది, మళ్లా పదిమందిరైతే మాటాడీది. ఒంటిగైతేనే ఆ బెరుకు. అప్పటికెంతానేదు. ఈళ్ళ మూడోదాయినేదా దానంతుండీది "

"ఏఁవిరతాతా! కబురంపినావా?"అంటూ అప్పారావు రావడంతో సూరయ్య మాటమధ్య ఆపేడు.

"నాయిన్నాయన అల్లా బారికోడికి తోడట ఎల్లుమీ" అన్నాడు అప్పారావుతో. దేనికంటే, ఎందుకో రాజయ్య చెప్పేడు.

"ఏఁవి నువ్వేల్లరాదేటి? ఇంతోటి పెద్దమేత్రీకి, కర్రిలు మొయ్యడం నామోసికా?"అన్నాడు. రాజయ్య ని‌డలేదు. బాబ్బాబనే అన్నాడు.

"అయితొక సుట్టముక్కిచ్చుకో"అన్నాడు అప్పారావు.

అప్పారావు ఆరడుగుల నాలుగంగుళాల మనిషి. అంతకు తగిన ఛాతీ. మనిషెంతజబరో మాటంతధాటీ. మంచికి మంచిగాచెపితే ఎంతచాకిరీఅయినా చేస్తాడు.

526

తిక్క రేగితే దేవుడు కొడుకునైనా లెఖ్ఖచేయడు. అంచేతే అడగ్గానే రాజయ్యచుట్టిచ్చాడు. అంతకుముందే బాబ్బాబన్నాడు. అప్పారావు అప్పుడు కదిలేడు.

అప్పారావు అందర్లాగా దుప్పటి కప్పుకొని రాలేదు. ఒగ్గావంచాకట్టుకున్నాడు. ఓబనీనుంది. పైన ఓ తువ్వాలేసుకున్నాడు. జడిస్తేనే చలైనా జడిపించేది. రాజయ్య యిచ్చిన చుట్టవాసనచూస్తూ చూరుకేసినడిచేడు

ముసిలిసూరయ్య చచ్చిపోయిన నారమ్మకు తన తల్లి ఈ ఊరి సంబంధం ఎలాకుదిర్చిందో చెపుతున్నాడు. "ఏవర్రొ అగ్గిరవకుందా?" అప్పారావు చూరుపంచ ముందు గొంతుకూర్చుంటూ అడిగేడు.

మంజూరులో ముగ్గురు నలుగురు ఆడవాళ్లున్నారు. గుమ్మంమీద గువ్వలా ముడుచుకు కూర్చుంది నారెమ్మ. ఆపక్క సగంలో అంకాలుంది. వాళ్ళవెనక గదంతా వెచ్చగా వచ్చని వెలుతురుంది,

"ఏది మా ఒదినేది? వదినా, అగ్గిరవక" అన్నాడు అప్పారావు.

ఆడవాళ్ళందరికి ముందుకూర్చుంది పోలమ్మ. ఓడలా కదల్లేకుండా వుంది. ఓసరిల్లి "లోపల దీపంవుంది ఎల్లి కాల్చుకో"అంది ముభావంగా.

అప్పారావు చూరు చప్పుడుచేస్తూ లోపలికి దూరేడు. అంకాలు సగం తప్పుకుంది. నారెమ్మ కదల్లేదు.

"బానే గుంటల్లార. గుర్రొల్లాగున్నారు. గుమ్మాలమీద కూకోవచ్చా? నెగండి నెగండి"అన్నాడు అప్పారావు.

అంకాలు లేచినిల్చుంది. నారమ్మ ఒళ్లు జరిపిందికాని కదల్లేదు.

"గుంటకి ఒళ్ళల్లా పొగరే." పోతూపోతూ కాలి బొటనవేలితో నారెమ్మను పక్కలో ఎక్కడో తాకేడు అప్పారావు.

నారెమ్మకు నాభినుండి నిలువూతా ఒక్కసారి సర్ర్‌మంది పాములా పక్కకి తిరిగి ఆ కాలు గట్టిగా గిల్లింది.

'ఓల్లంజో' అనబోయి ఒక్క ఎగురెగిరి ఆపుకున్నాడు. "గుంటమాకాన్ది" అనుకుంటూ చుట్టకాలుస్తూంటే దీపం భగ్‌భగ్‌న మండి ఆరిపోయింది.

"ఒదినో అగ్గిపెట్టె"అరిచేడు అప్పారావు పోలమ్మ విసుక్కుంటూ లేచింది. నెలలునిండిన మనిషి నెమ్మదిగా నడుస్తోంది.

527

చీకట్లో ఒకళ్ళిటు ఒకళ్ళటూ పోలమ్మా అప్పారావూ తడుముకుంటున్నట్టు నడుస్తున్నారు. అప్పారావు తలుపుదగ్గరకొచ్చేసరికి నారెమ్మ లేచిపోయింది.

అగ్గిపుల్ల గీసిన వెలుగులోచూస్తే ఆడవాళ్ళమధ్యగా నించుంది.

ఆమాత్రిం భయముందిగదా అనుకున్నాడు అప్పారావు. నారెమ్మ పక్కనే నిలబడి చుట్టని ఎర్రిగా కాలుస్తున్నాడు. నారెమ్మ గుండెల్లో దడపుట్టింది. ఆమెకాళ్ల ల్లోంచి వణుకు పుడుతోంది.

గట్టిగా బుక్కెడు పొగపీల్చి ఆమె మొహమ్మీదికొదిలేడు. చప్ట చూరు దాటి వాకిట్లోకి పోయేడు.

కధవింటున్న ఆడవాళ్ళకు యివేవీపట్టలేదు. ఆకటికడుపునవున్న నారెమ్మ కొక్కసారి కడుపులో దేవినట్టయింది. వణికే నడుముతో వెళ్ళి గుమ్మంలో కూచుంది.

పదహారేళ్ళ నారెమ్మకు బతుకులోహాయెంతో, వెలుగెంతో, ఇంట్లో ఒంట్లో చీకటీ, బాధా అంత. నవ్వుతూనే వుంటుంది, కేరుతూనే వుంటుంది. లోలోపల దడ దడలు, దిగుళ్లు. రక్తం, ఏవేళా మంటలు రేపుతూ పరుగులు, తిన్నా తినకున్నా ఆకలి– పేగులు చుమ్మలుచుట్టే ఆకలి.

''... దీనికి పన్నెండోఏటే పెళ్లయింది ఏడాదిలోపునే యీడేరింది. అయితే బంగారాలకాడ తగువొచ్చి ఎదిగొచ్చిన కోడల్ని నాలుగైదేళ్లు పుట్టింటికాడే ఒగ్గేసింది– దీనత్త, ఎందరెన్నిచెప్పినా గుమ్మంతొక్కనిచ్చింది కాదు ముసిలి ముండ మహాకాన్ని. దాన్ని మీరెవ్వరూ ఎరగరు... ''అంటున్నాడు సూరయ్య.

నారెమ్మకూడా పెద్దమనిషై నాలుగేళ్లు కావస్తోంది ఆమెపెళ్ళి యెప్పటి కప్పుడు వెనకపడిపోతోంది. గత ఏడాది కప్పరాం సంబంధం తల్లితరఫునుండివచ్చింది. అంతా సెటిలైపోయింది. పంటలు పోయేయి. వీళ్లు తూగలేకపోయేరు. వాళ్లింకో సంబంధం చేసుకున్నారు. ఈ ఏడాది పంటలు పండేయి– కుదిరితే చేదామనుకున్నారు. ఎవ్వరూ అడగరాలేదు ఇంతలో యీచావు. పెళ్ళి వెనకబడ్డకొద్దీ నారెమ్మమనసుకీ, శరీరానికీ పొంతన మరీ మరీ దూరమవుతోంది. ఒకమాట అనబోయి యింకోమాట అంటుంది. ఒకపని చేయబోయి యింకొకటి చేస్తుంది. పగలు రాత్రినిగురించీ రాత్రి పగలును గురించీ ఆలోచిస్తుంది.

నారెమ్మకు రేలూ పగళ్లు– కళ్ళముందు పంటకళ్లాలు; కండలు తిరిగిన గడ కర్రిల్లాటి కాళ్ళపై దాగర్లలాంటి వీపులు; నెత్తులమీద బిళ్ళకు సరిపడ[illegible]మోపులు;

పరుగులు, గాల్లోకి ఎగిరే ఆమోపులు; బారులుతీరి కోతలుకోసే చీరల గిలుకు గిలుకూ చప్పుళ్లు;పరాచికాలతో పరుగులతో కవ్వించి చేతికందని కుర్రాళ్లూ కన్నెపిల్లలూ; కన్ను మూసినా కన్ను తెరిచినా— కోతలు, కుప్పలు, మనుషులు. వంటలు. మందలు. గుంపులు; అర్ధమ్మరేయి చలిలో చీకటిలో కటికినేల చల్లదనానికి తెలివొచ్చినపుడల్లా నారెమ్మగుండెల్లో ఊపిరిసలపనిబరువులు.

‘‘—సివరికి కొడుకు సెడుక్లు తిరుగుతున్నాడని యిని ఇంకెవర్తిని తెస్తాడో పీకమీదకని. అప్పుడు కోడల్ని తెచ్చింది. పెద్దమనిసైనాక మొత్తం నాలుగైదేళ్లు పుట్టింటే ఉండిపోయింది నారమ్మ, అయితే ఒక్కళసేత ఏలెత్తిసూపించుకోలేదు ’

....ముసిల్దాయి గురించి శానామంది ఎప్పుడ చెప్పినా మంచిగానే చెపుతారు. అయితే చివర చివరికొచ్చేసరికి దాని మంచంతా మాయమయ్యిందేమో మనవరాళ్ళకి. అందులో నారెమ్మకు దానిలో చెడేతప్ప మంచి కనిపించదు.

నారమ్మా నారెమ్మా ఎప్పుడూ తగులాడుతూనే వుంటారు. అ తగువులు తీర్చేసరికి ఎరకయ్యకీ సాఁవాలుకీ తలప్రాణం తోక్కొస్తుంది,

‘‘ దాన్నెత్తి కరవై ఏళ్ళొచ్చినాయి. దీనికింకా యీసెంప కొడితె ఆసెంప పాలు కారె వొయసు. ఈళ్ళిద్దరికి యీపైరవేఁటో’’ అనేవాడు ఎరకయ్య, ‘‘ఇద్దరికిద్ద రాకశే, దానిపేరెట్టినందుకైన దీంతో సర్లీగుండదు ముసిల్ది, యిదీ అంతే, అద్దఁవుంది ముకఁవుందన్నట్టు అచ్చుదాని పోలికిని పుట్టింది, మళ్లా దాంతో తగువాడతాది! ఎక్క డికి పోతాది ఆ కిర్రిబుద్ది? కిర్రిపట్టుతో సహా నాయనమ్మ ముక్కులోంచి ఊడొచ్చి నాది’’అనీ వాడు ఎరకయ్య.

పొట్టీ పొడుగూగాని నాయనమ్మా మనవరాళ్ళది అచ్చం ఒకటే రూపు.

‘‘పేరుదాందికావచ్చు. పోలికాదాందే— ఇదేటి సెరిపీసుకుంటె సెరుగుతా దేటి? కాని బుద్దులు దానివంటె నానొప్పను. ఆ ముసిలిముండకీ నాకూ అక్కడ పోలిక తేవద్దు’’అనీది నారెమ్మ.

యవ్వనం యిచ్చే వరాలన్నింటితో దాని శాపాలనుకూడా మోస్తూ పకపక బొకబొకలుగా తిరిగే నారెమ్మనుచూస్తే ఉలికులికిపడీది ముసిల్ది. ఆమెను ఈగనుతీసేసి నట్టు తీసిపారేసేది నారెమ్మ. దానిమీద—

‘‘ఓలేటోలె అంత మిడిసిపాటు. కసింతిదాసే. కసింతదాసే, కాలఁవంత ముందుందే’’అనీది ఓసారి.

529

ఇంకోసారి ''ఏటిసూసుకునే అలారాలి పడిపోతా? కాదు, ఏటిసూసుకునీ? వొాయిసా!? వొాయిసునాడు నానూ వుండీదాన్ని— నీకన్న రెపరెపనాడుతూ, యిప్పుడు సూడునాఅందఁవు''అంటూ పైట తొలగించి ఎండిన తనరొమ్ములు చూపేది.

అలాంటి బుద్ధులు చూస్తేనే నారెమ్మకి ఒళ్లమంట—

''పోపోయె ముసిలిముండా! సిగ్గునేదు నెంజికి!! సిన్నప్పుడు మాతాత తన్ని నట్టు మెత్తగ తన్ని వోణ్నేక ఇప్పుణ్నీ వొాళ్ల అనాగ పులిపిపోతాంది. నేకపోతే ఏటా పన్లు? సీ! '' చీదరించుకునేది నారెమ్మ.

''సవితీ యారాళ్ళపోరు నాకీసంత ఎప్పటికి తీరతాదో''అనేది ఇంటి యజమానురాలు అటు అత్త యిటు కూతురు— సావాలు ఎటూ చెప్పలేకపోయేది.

బయట సూరయ్యతాత కథ చెపుతున్నాడు.

''....అయితే కొట్టినంతసేపు కొాట్టేవోడు. అదయ్యింతరవాత యిలాగ సంకకెత్తీసుకుని గిరగిరగిరగిరా తిప్పి గుభీమని ఏ సొప్ప దిబ్బమీదో యెత్తీసీవోడు.

''అందరూ అణ్ణి దెబ్బలాడీవోరు. 'ఒరేనీకిదేటి తిపారంరా! ఆడమనిసి ననాగ ఏడిపించకూడదురా. దాని కళ్లనీళ్ల యెంతరాత్తే నీకష్టాలంతకన్ని అలా పెరుగుతాయిరా''అఁటూ బుద్దులు సెప్పీవోరు. ''అందికేగదా నవ్విస్తన్నాను. ఒలే ఒల్నంజ ఇంకా నవ్వేఁవేఁ? నవ్వుతావా తన్నమన్నావా?''అనీవోడు నాలికడ్డగ కరుసుకుఁటూ. జనఁవందరు ముక్కుమీద ఏలేసుకుంటే, యిది— యినాగ నవ్వీసి నెగిసిపోయీది....'

నారెమ్మకి నాయనమ్మంటే ఎంత అసహ్యవోఁవాళ్ల తాతంటే, అతడి కబుర్లంటే ఆమెకంత యిష్టం. ఆమె పుట్టకముందే అతడు పోయేడు. అయినా అతణ్ని చూచినంత స్పష్టంగా అతడిగురించి వింది.

పెదమనవరాలికి నాయినమ్మంటేనే జాలి—

ముసల్దానికూ్కడా పెద్ద మనఁవరాలంటే చాలా యిష్టం. ''దాని ఒబ్బిడి, మాటపొందిక యీ రాలుగాయినంజకి నస్తేరాదు''అనేది యిద్దరు మనవరాళ్లనిపోలుస్తూ.

''దాన్లాగ ముగ్గురు బిడ్డల్నెత్తితే దీనికీ వొాస్తాది''అనేది సావాలు.

''ఆఁ వొాస్తాది, దీనికిముందు మొగుడంటూ ఒకడురానీ— ముగ్గురు పిల్లల ముచ్చట ఆ ఎనకసూద్దుం''అనేది ముసిల్ది.

530

నారెమ్మకు పెళ్లికాకపోవడం ఆపిల్ల తప్పుకాదు. అయినా 'రాలుగాయి నంజలకి పెళ్లిళ్లవడం మాట్లేటి? ఒకేళయినా అలాటి నంజలకి కడుపులు పండవు. కడుపృండని ఆడదాయీ ...' అనీది ముసిల్ది

ముసిల్ది చాలామందిని కని పెంచింది. దానికి చంటిపిల్లలంటే చాలాఇష్టం. అలా పిల్లతల్లి కాబట్టే పెద్దదంటే మోజు. కాదుకాబట్టే చిన్నదంటే మరీ చేదు.

''...అయితేకనీ, పెంచీరోజుల్లో యీనారెమ్మ ఎలాగుండీదో ఎరికా-లేత పరువుకే ఇరగ్గాసిన బొప్పాసపసెట్టు నాగుండేది తల్లి.

''–ఎక్కడికేన ఎల్తే దీని పిల్లలందరూ దీనెంట పడీవోరు. ఇనుపన్నది నేకండా, యీసంకనోబిడ్డ, ఆసంకనో సంటిపిల్ల, ముంగట ఇద్దరో ముగ్గురోగుంటలు ఎనకాతల మిగిలినోళ్లు! అలాగ అందర్నీ ఎంటేసుకు తిరిగింది.

''అది నల్లా ఎలాంటి బాదలుపెట్టినా ఆతరవాత్తరవాత అత్తకీ మొగుడికీ కూడా దీనిమీద అబిమానాలు పుట్టినాయి, ఓపిల్లని తీసినట్టూ, ఓకోకగుడ్డకొన్నట్టూ, కాలూ సెయ్యీ నొచ్చినప్పుడు 'ఉన్నావా తిన్నావా'అని అడిగినట్టూ, యినాగ మారతన్నారు, ఇంతలో ఒకేడాదీ వరదలొచ్చినయి

"మొట్టమొదట మనకు ఓట్లురానేదా, అంతకి రెండుమూడేళ్లముందు పెద్దపెట్టున బూవీ అకాసాలు ఒక్కటైపోయినట్టు ఊఁఒకటే కుండపోత ఇంక గంగేటీ-ఏళ్ళూ గడ్డలూ ఏకమైపోనాయి. ఎన్నివూళ్లు మునిగినాయో నెక్కనేదు.

"అత్తల పద్దేరు, యిత్తలసిస్నేరు, ఇల్లిక్కడ రంగన్నపేటకాడ పెద్దగడ్డనేదా, దాన్తో కలుపుకుని అన్నీ ఒక్కసారి పొంగిపోనాయి. అది పశువుల సావేకాదు, మనసులసావేకాదు, ఎన్ని పాఁవులు కొట్టుకొచ్చినాయో, ఎంత మంది మడుసులు కొట్టుకుపోనారో లెక్కలు తెలవ్వట.

"అయితే వరదలదెబ్బ మనకునేదు. దాన్తరవాతొచ్చిన మసూచికఁవుమన్ని తినీసినాది. మసూచికఁవొచ్చి అంతకు పదిరెట్లజనం దుల్లిపోనారు.

"మనూర్లో ఊరంతటికీ పాతిక శవాలుపోతే ఒక్క మాలపేటలోనే పదారు పోనాయి. పేటంతటి దెబ్బా ఒకెత్తైతే దీని ఒక్కంటిదే ఒకెత్తు.

"దీనికిద్దరు సిన్నపిల్లలూ, ఎదిగొచ్చిన కొడుకొకడూపోనారు. దుక్కనాటి అత్తముండకి కాళ్లపోనాయి, నడివయసులో, గడించే మొగుడికి, రెండుకళ్ళూ ఒక్కపాలి పోనాయి.

"ఆదెబ్బకి యింకోళ్లా మరికోళ్లా అయితే యేటవుదురో– యిది మాత్తరం అలాగే నిలబడింది. తాత్తంద్రులు గడించిన మూరా చారా మడిసెక్కలు అప్పటికే తాకట్లపాలైనాయి. నాలుగైదేళ్ల ఏంతిన్నారో ఎలాగున్నారో, ఎవ్వరికెరికెనేదు, అందరి సంగతటుంచు, అన్నిటికి ఇదొక్కత్తేకదా– ఏనుగునాటి మనిసి పీనిగై సాకిరీలుసేసింది.

"రోజులకొద్దీ పస్తులేవుందా, కట్టుకోనానికి మారుగుడ్డనేక ఏళ్ళతరబడి ఒక్కొక్కకోకతోనేవుందా, పొగలూ రేలూకూలిసేసి పొద్దుటా పొద్దోటా వూళ్లో వాకిళ్లే తుడిసిందా, ఇంకెన్ని పాట్లు పడ్డదో దానికే యెరిక, ఆ బగమంతుడికే ఎరిక!

"అలాగే ఆ సిన్నపిల్లల్ని పెంచుకుంటా. కళ్లులేని మొగుడుకీ, కాళ్ళులేని అత్తకీ ఒక్కమాటనకుండ ఒక్కమాట పడకండ సాకిరికి సాకిరీ. పోసవర్గానికి పోస వర్గం– రెండూ నడిపింది.

"ఇంతలో ఒకేడాది, అమ్మోరు పండక్కి కావాల– అడుక్కుంటే ఎవరో నాయురాలు అరిసి ముక్కెట్టింది అది తిన్నరాత్తిరికాణ్ణుండి అత్తముండకి బేదులట్టుకున్నాయి. అందులో ముక్కలే పిల్లలూ తిన్నారు. దాని బొంది పోనానికి ఇది నిందయ్యింది. ఆఏడాదో, ఆ మరసటేడో గుడ్డోడు సెరువుగట్టుకెల్లి తిరిగొస్తున్నాడు. దావయ్యగోరునేరా ఆళ్ళకోకర్రి బేపివుండేది ఏపీ నేదు, కాళ్ళకడ్డంపడ్డాదని కర్రితో యినాగన్నాట్ట అంతే. అది కరిసీసింది ఆర్నెల్లు తిరక్కుండా ఆ మొగుడుకూడా పోనాడు అక్కడికి దాని కట్టలు, ఆకకట్టాలుకూడా యిరగడైనాయి"

తరువాత గుక్కతిప్పుకోవడానికి సూరయ్య కొంచెంసేపు ఆగినట్టుంది. ఊపిరి తిరిగేక–

"పుట్టినోళ్లు పుట్టగా, పోయినోళ్ళుపోగా, దీనికిప్పుడు యిద్దరు మగపిల్లలూ ముగ్గురాడపిల్లలూ కావోల దక్కినారు."

"అందరికన్న పెద్దోణ్ణి మీరెవ్వరెరగరు. నా పెద్దకొడుకు తోటోడు సిన్నప్పుడు ఆళ్ళ నాయనమ్మఏటో అందని కలకత్తాకో, కాశీమట్టో పారిపోనాడు, దార్లకాడ పనిదొరికిందంట, ఆళ్ళమత (పుచ్చుకుని అక్కడే ఓపిల్లని పెళ్లాణ్ణాడు. పాతికేళ్ళకింద ఒకపాలొచ్చినాడు. వస్తాపోతా వుంటానన్నాడు కాని మరి రానేదు.

"ఎన్నాలో ఆడికోసం ఏడిసేది." ఆ తరవాత ఆశలొగ్గుకుంది.

"తరవాత ముగ్గురాడపిల్లలు. ముగ్గురికీ ఇదే పెల్లిల్లుసేసింది. కలిగినకాడికి రాకాపోకానడిపింది."

532

"ఒకత్తెను సోంపేట ఇచ్చింది. దానిమొగుడక్కడ కొబ్బరితోటలక్కావాల, కాపలాపని, దానికి నలుగురో అయిదుగురో పిల్లలు."

రెండోదాన్ని ఇజానారంకాడ జొన్నలవలసిచ్చింది. అపూరు బారికోడు పెళ్లాడినాడు. దానికీ వుండాలి యిద్దరో ముగ్గురో మగపిల్లలూ ఒకాడపిల్లా.

మూడోదాని సంబంధమే కసింత తిరకాసైపోనాది. దగ్గిరని సిలకపాలెంలో, సిన్ననరిసిగాడి బామ్మరిదినేడా, ఆడికిచ్చింది. ఆముండాకొడుకు తాగుముచ్చోడు. ఆడు పెట్టేబాదలు పణ్ణేక ఏ తాళ్ళకుర్రాడితోనో, గంవళ్లాయనతోనో, సరీగ్గుర్తునేదు– ఎవరితోనో లేచిపోయిందన్నారు. 'నాకూతురలాటిదికాదు. నిప్పులాటిది, ఎందలోన పడి సావనైన సస్తాదికాని, అలాటి తప్పుడుపన్లు సెయ్యదనేది ఈముసిల్ది. మొత్తానికి ఆళ్ళక్కడానేదు, మనక్కడానేదు. ఎక్కడున్నాదో తెలీనూ తెలీదు.

అంటూ– "అవునాఁ మళ్లా దానికబురేమేనా తెలిసిందా?"అన్నాడు ఎరకయ్య నుద్దేశించి.

ఎరకయ్య గొంతుసర్దుకొని అంతలో మనసు మార్చుకున్నవాళ్ళా.

''ఊఁ....హూఁ....''అన్నాడు మూలుగుతున్నట్లు.

''ఇంక తెలిస్తేటి తెలకపోత్నే– దాని బతుకేదో అది బతకతంది. ఒక అయ్యసేతిలో ఎట్టిందాకే ఆడపిల్ల మంచి సెడ్డలు పుట్టింటియ్యి. ఆ తరవాత అది ఏంవయ్యనా పలానోళ్ళ కోడలంటారుకాని, కూతురనరు. అయినా మన మనిసన్నాక, మో! అంతే''–.

అంటూ సూరయ్య ఆగిపోయేడు.

కొంతసేపుపోయేక పొరుగింటి పాపమ్మ అంది

'ఏనాటిముచ్చట్లు, ఏనాటికబుర్లు. మా మామకియన్ని ఎంతగేపకం వో!'అది.

''మరింక పనా, పాటా? ఈకాళ్లు పుళ్ళైపోయినకాణ్ణుంది అలాగ మంచం మీద సాగోరడం, యిలాగ యీపేట పేటంత కలుపుకొని యీసుట్టుపట్లజరిగిన సంగతులన్నీ నెమరేసుకుంట తొంగోడం– యిదేనాపని''అన్నాడు సూరయ్య.

సూరయ్యకు పదేళ్ళకిందట పట్టుకున్న ఏనుగ్గజ్జి ఎన్నిమందులుపెట్టినా మరొదల్లేదు. కొడుకులు ఊర్జితమంతులూ, పెద్దవాళ్ళూ– అంచేత తండ్రి యింటిపట్టున కూచున్నా గడిచిపోతోంది.

రాత్రి ముందుకి సాగినకొద్దీ చలి అంతకంతకూ పెరిగిపోతోంది. దుప్పట్లు సగం మేరకు మంచుకి జుఁవునుకుని బరువుగా చల్లగా తగుల్తున్నాయి.

వయసులోవున్న తననే గజగజలాడిస్తున్న చలినిచూసి రాజయ్యా, సూరయ్యా సంగతి ఆలోచించేడు.

"అయ్యా. మాపంచ"లో ఎండుగడ్డి ఉంటాది. కపింత తెమ్మీ" అన్నాడో కుర్రాడితో.

కాని. సూరయ్య ఒప్పలేదు—

"ఒద్దొద్దు, యిప్పుడుకాదు"అన్నాదు సూరయ్య.

*   *   *

కర్రిలకెళ్ళిన అయిదుగుర్లోనూ ఇద్దరు తిరిగిస్తున్నారు.

"ఏఁవిరయ్య, కాయా, పండురా?"అంది లచ్చువమ్మ.

"కాయంటె కాయాకాదు, పండంటె పండూకాదు. దోరపదునుకొచ్చి అగిపోనాది"అన్నాడు సీతయ్య.

ఆతడితో వచ్చిన అప్పారావు మాట్లాళ్ళేదు. సీతయ్య కప్పుకున్న దుప్పటి దగ్గిరగా లాక్కుంటూ పెద్దలకెదురుగా కూర్చున్నాడ.

అప్పారావు కూర్చోలేదు. అరచేతులు జబ్బలమీద వేసుకుని ఓ వారగా నిలబడ్డాడు.

"తిన్నగ సెప్పరా! ఏమాట దగ్గిరా సెఁవత్కారమేనా?"అంది. పంచలో కూర్చున్న సీతయ్య తల్లి.

సీతయ్య బుద్ధికుదిరింది. జరిగినసంగతి సజావుగా ఆరంభించేడు.

... బారిక కన్నయ్య రెండు మూడుచోట్ల చిన్నచిన్న రైతుల్ని లేపి అడిగేడట. సందెడూ మోపిడైనా ఎవళ్లదగ్గరాలేవు. అందరూ పెద్దనాయుడింటికో, కరణంగారింటికో, లేకపోతే సుబ్బారాయుడుగారింటికో వెళ్ళమన్నవాళ్ళే.

"—అరవగా అరవగా అంగంటకి నాయురాలు నెగిసింది. నెగిసినాక ఎలెక్ట్రిక్ లైటు లోపల్నుంచే ఎలిగిచ్చింది. అదెలిగిచ్చిన యింకోగంటకి తలుపు తెరిసింది.

తెరిసి యినాఁగ, సిన్నపిల్లిలు దాగుడు మూతలాడతారు సూసినా, అనా తొంగిసూపి 'ఎవరోళ్ళూ... ?' అంది.

534

సీతయ్య ఆమె గొంతుకూ్కడా వినిపించేడు.

"నానమ్మ. పెదబారికి" నన్నాడు మనోడు. కొంత నిబ్బరఁవయిందికావాల. తలుపు దగ్గిరేసి లోపలికెళ్లిపోయింది.

నాయుణ్ణి నేపుతాది, నెగుత్తాడో నేవదో, ఏటంటాడో, ఏటౌతాదో అనుకుంటా మాఁవలాకూ్కకున్నాం.

మరోపావుగంట పోనాక, సూసినా, గోరీల్లోంచి నెగిసొస్తాయి తురక దెయ్యాలు— అనాగ 'ఉహూహూ'అంటూ ఎఱ్ఱసేలవా, తెల్లదుప్పటీ జోడించి బయలెల్లింది నాయురాలు.

ఇత్తలికిరాగానే, తలుపుదగ్గిర నొక్కేసింది. నొక్కేసి మెట్లకాడకొచ్చి—

"నాయుడు నెగడంనేదురా, యీరాత్రిప్పుడేటా్రి?" అంది బారికోడితో.

"నాయెడెందుకమ్మా, నువ్వున్నావుగావా. ఇనాగ మాసెడ్డ ఆపదొచ్చింది. నీమీన పుట్టెడాశతో ఒచ్చినాం. ఇడుగో, సచ్చిపోయిందాని మనవడు. దిక్కుదిబాసు లేనోల్లు. గేమానికి తలిదండ్రులు మీరేకాయాఁ!" అంటా ఈ జరిగిన సంగతంతా ఒక దొడిత్తే ఒకడందుకుంటూ, ఒయినాలవారీ, ఆయమ్మ మణుసు కరగా సెప్పినాఁవు.

"సెప్పినంతసేపూ సెద్దగిందిరయ్యా. సచ్చిపోయిన మనిసినికూడాపొల్సినాది. 'పాలికేళ్ళకిందట మాకూ, మా మరిదిగారికీ వాకిళ్ల తుడిసిందికాదా?'అంది, 'దాని పెద్ద కొడుకే కాదా యిల్లొదిలి పారిపోనాడంది.' 'దానత్తకే కదా మసూచిఁకఁవొచ్చి కాళ్ళుపోనాయంది'; దాని మొగుడేకదా బేపికరిసి సచ్చిపోనాడంది'; 'పాపం, మంచిముండ నానా కష్టాలు పడ్డదంది' కరత్రిలకాడి కొచ్చేసరికి, యీ నారాయన్నారాయనంతా బొల్లిగెద్దై గబాల్న ఎగిరిపోనాది.

"కరత్రిలా" అంటూ సతికిల్లపడిపోనాది తల్లి. "అమ్మ! ఏటైపోద్దో" అని మాకూ గుండెలు నొట్టొట్లాణ్ణాయి.

"తల్లి, తల్లి! నువ్ కాదంటె మాం సచ్చిపోతాం. మరేటనకు, మరోమాటే అనకు" అంటా కన్నయ్య మాఁవ పంపారంబించినాడు. కసింతసేపయీసరికి మాటొచ్చింది.

"కరత్రిలింకెక్కడ దొరకవటా్రి, వూరందర్నాగ్గేసి, మాకాడికేవొస్తారూ?" అంది నాయురాలు.

"అమ్మ పున్నెఁవేకదా, యిలాటిదానికి సాయంసేత్తే ఎన్నో గుళ్లు కట్టిచ్చిన పలితఁవంటారు. అందులో పేదముండ, నీ వోకిలి తుడుసుకు బతికిన గులాప్‌ముండ" అంటా అటుకాసిటు కాసనకండ అన్నిదిక్కుల్నుండి దువ్వుతున్నాడు.

"అట్టె ఆలోసించి ఆలోసించి 'సరె, రేపు తెల్లారి నెగ్గానే రండి ఎనకింట్ల నాలుగు తాటి దుక్కలున్నాయి. పట్టుకుపోదురు"అంటా నెగిసిపోనాది.

"ఇదేటమ్మా, ఇంత సేపు సెప్పిందేటి, రేప్పొద్దన్నకయితె రేపేరావాఁ? ఈ అద్దమ్మ రేత్తిరినీ తలుపేల తట్టాల? నీగుమ్మంకాడ యీ శవజాగారమంతా దేనికి? అని ఎన్నిదాల బతుములాణ్ణాఁవు?"

"ఇప్పుడటకెవరెక్కుతారూ? అటకమీద కుండల మండలున్నాయి. మైల పడిపోవా—?"

"మీ కాపోణ్ణే తెస్తా"వన్నాం.

"ఒక్కడేటి దించుతాడు? అటకమీద పురుగూ పుట్ర ఉంటాదేవోఁ?"

''నలుగుర్ని తెస్తాం. టార్సిలైటిత్తావఁన్నాం"

ఇంకెంతికీ ఒదలపోప్పోతే గబిక్కిన కోపం తెచ్చీసుకుంది.

''ఏటి, ఎంతకీ మీరన్నదే మాటా, ఇత్తలోళ్లు అన్నం తింటన్నారా. గడ్డి తింటన్నారా! రేప్పెందలే రమ్మాన్నానా? ఒస్తేరండి, నేపోప్పోతే ఎందల దూకతారో దూకండి— నాను మాత్తరం ఈ సల్లో మీతో సావలేను"అంటూ దబీమని తలుపేసేపింది.

జారికిమాఁవ ''అమ్మమ్మ...."అంటనే వున్నాడు. 'మీదిమండ మింగేజాలి, అందుకే మీకేసి ఏలెవ్వరూ ఎత్తిసూవరంది.'

పైగా ఆయమ్మ అంటాదీ—

'ఔనాి, మీరెంత తక్కువకులఁవోళ్లైనా రాత్తుళ్లు శవాన్నితీస్తా(రా? రాత్తుళ్లు శవాల్ని కాల్సొచ్చా? మాలో అలా కాల్సఁవేఁ? శవాల్ని కాల్సినాక తానాలో? ఆమంచు నీళ్లల్లో మునగ్గ(లా? అందికే మీలో శవాలకాడ తాగుతారు....!'

''ఇనాగ మాటాడితే ఈ అప్పారావుకొక్కపఁవూ

''ఇచ్చేమాటైతే యియ్యరాదా, నేపోప్పోతే ఆ వుద్దేశం నేదనరాదా? ఆమె లికలన్నెందుకు, యీ ఎత్తిపొడుపు లెందు''కంటాడు.

536

"అమ్మమ్మ! అయమ్మనాటిదికాదు. ఆ తల్లిది యెన్ననాటి మనసు. మన మీద జాలికొద్దె అనాగంది. పొద్దున్నొస్తె నిబ్బగే యిస్తాది. ఈ అద్దరాతిరి సల్లో మనంవంటె సవ్వగలంగాని ఆయమ్మ సవ్వగల్దా? మనంవేన అల్లా కూలీ- ఆతరతకొద్ది యీసల్లో సావనాని కొప్పుకున్నం; కాని సన్నీల్లలో మునిగితె, రేపొద్దున్న సంకటా లొస్తె, ఆమీన ఏటేనైతే ఆపాపం ఆయమ్మదికాదా? అందికే అనాగ మెలేసిందంటాడు కన్నయ్యమాంవ.

"మద్ది నీళ్ళద్దరు మొగుసుకు పోతన్నారు. ఇలాకాక్కాదని నానీణ్ణిలాక్కొచ్చేసి నాను" అంటూ సీతయ్య ఆగిపోయేడు,

"మరాళ్లో?" అన్నాడు రాజయ్య.

"ఆళ్ళింక సుబ్బారాయుడుగారింటికా, కరణంగారింటికా, అసలెల్లడంవా, మానడంవా అని ఆలోసిత్తన్నారు— అదిగో ఆళూ ఒచ్చేసినారు" అంటా వట్టిచేతుల్తో తిరి కొస్తున్న కన్నయ్యవంకా తక్కినవాళ్ళవంక చూస్తూండిపోయేడు.

కన్నయ్య కర్రకిందపెట్టి,— 'మరెక్కడ కుదిరింది కాదురయ్యా. తొంగు న్నోళ్లు నెగేనేదు, నెగిసినమ్మ ఏటందో యినేవుంటారు. మరీ రాత్తిరేల కర్రలు దొరక సస్టే" అంటూ చతికిలబడిపోయేడు.

ఉన్న ఆశలన్నీ పోయినట్టు అందరూ అట్టే ఆలోచిస్తూ కూచుండిపోయేరు. కొంతసేపయ్యేక యింకో ఆలోచన చెప్పబోయేడు—

అప్పారావు గద్దలా అందుకున్నాడు.

'ఒరేయ్, ఓరె సొట్ట నంజకొడక! సొట్టబుద్ది నంజకొడక! నీ సొట్టాలోస న్లింక సాలుగాని కసింత అపు' అన్నాడు అప్పారావు. అని పెద్దలవంక తిరుగుతూ—

'నాను మీకన్న సిన్నోణ్ణె కాని మిమ్మల్నోమాటడుగుతాను తిన్నగసెపతారా?' అన్నాడు అందరితో.

అప్పారావు సంగతి అందరికీ తెలిసిందే. ఏదో ఉప్పెన తెచ్చేముందే అలా మాటాడుతాడు అంచేత ఎవ్వరూ మాటాళ్లేదు—

'నిజంగ మీకీ శవాన్ని కాల్చాలనుందా? నేపోతే సచ్చిందాని జీవుడికీ, బతి కున్న దాని బందుగులుకీ, కళ్లు తుడవాలని యీ నాటకవాడతన్నారా? మీగుండె మీన సెయ్యేసుకు మరీ సెప్పండి' అన్నాడు అప్పారావు.

537

రాజయ్య, బారిక్కన్నయ్య, చివరకు సూరయ్యతోసహా ఎవ్వరూ మాటాల్లేదు. వింటున్నవాళ్ళకేదో వెలక్కొట్టినట్టై అందరూ మతులు తెచ్చుకున్నారు.

“కాదు, మాయామల్మాలొద్దు. విబ్బగ సెప్పండి— ఎక్కాడో ఒక్కాడ నిజంగా కర్రిలు తెచ్చి ఈ శవాన్ని దానపరుతవనుందా? నేపోతే యినాక్కసింత సేపు తిప్పి తిప్పి 'కర్రిల్దొరకనేదయ్యా' అని కప్పెట్టేస్తారా?

అప్పారావు అంత మాయామర్మంలేకండా అలా అందరిమధ్యా అడగడం బాగులేదనే అనిపించింది కొందరికి.

సూరయ్యకు మనసు నొచ్చింది—

తక్కినవాళ్ళ సంగతెలాగున్నా అతడికిమాత్రం 'ఎక్కడేన కర్రలు దొరికితేనె బాగుణ్ను' అనే మనసులో వుంది. ఆసంగతే యింకోలా చెప్పేడు, 'అనాగైతే దేనికిరయ్య యీ పక్రాకులన్నీ? ఏం యింటికాడ ఎచ్చగ తొంగోనేవా?' అన్నాడు నిదానంగా.

'ఏం, కప్పెట్టేత్తే పనికిరాదా?'

'—మించొచ్చినప్పుడో, మరందుకు శకితి లేనప్పుడో యేంసేసినా తప్పు కాదు. కాని కాల్పడంపే మన కులాచారం. కొన్నలాగ, కొన్నిలాగ జరిగతన్నాయంటే- మరీరోజుల్లో, ఎనకట్నాగ, దేన్లోనీ 'పట్టు'నేకే.'

'ఏం కప్పెట్టేత్తే ఏటౌద్దీ?'

'ఏటౌద్దంటే ఏటీకాదు. పెద్దలు సెప్పడం ఆ జీవుడు పైకిపోదంటారు, దెయ్యంవౌతాడనీ, ఏడుస్తు ఇందంబడె తిరుగుతాడనీ రకరకాలుగనుకొంటారు.'

'మీకానమ్మకం గట్టిగానేవుంది— అవునా?'

సూరియ్య జవాబులేదు.

'మరి అనాటప్పుడు యీ ఒంక సూపులన్నీ దేనికీ? తిన్నగ ఆలోసించరాదా?'

దానికెవ్వరూ జవాబివ్వలేదు.

'మీక్కర్రిలే కావిలిస్తే, అదీ యీయాలప్పుడే కావిలిస్తే, అ కర్రలెక్కడ దొరుకుతాయో, ఏ బాదానేకండ, ఎన్ని కావిలిస్తే అన్నీ ఎక్కడ దొరుకుతాయో మీకు తెల్దా?'

.... .... .... .... .... .... .... ....

538

"ఇంటింటికీ ఆవులవీ, దూడలవీ కట్టుకొయ్యిలుంటాయి. ఎవ్వర్నీ నేప క్కార్నేదు. ఎవ్వల్నడగక్కార్నేదు. పదిళ్లు తిరిగినారా, ఇనాటికవాల్ని పదింటిని తగ లెయ్యొచ్చు.

"అవుసరం— నిజంగ నీకవుసరం కావాల. అప్పుడు మనిసిదేనికేనా సిద్ధ పడతాడు—

"కాదు— ఇది దొంగతనం. మాం దొంగతనం సెయ్యఁవంటారూ, పదండి పందిరి అప్పయ్య కళ్ళఁవుంది— ఒల్లకాడుకి ఎంతో దూరంనేదు. కూతురు పెళ్లికని ఆరుబళ్ళ కర్రిలు కొట్టిచ్చి కుచ్చిలెత్తిచ్చినాడు. ఆ పెళ్ళెప్పుడో మాఘమాసంలోనో, వొయ్యాక మాసంలోనో అగుతాది. అడగండి— పొద్దుటోయేనోగా కానో, ఇంకోకాడ అడుక్కానో ఆయనకర్రిలాయనకిచ్చేవొచ్చు. ఇవ్వనఁటాడూ. ఆడ్నీ ఆడి కర్రిల్నీ కలిపి ముసిల్దాయితోపాటు కాల్చిసిరండి.

"మీకు దొంగతనఁవూ కిట్టకపోయి. దొరతనఁవూ కిట్టకపోద్దీ— పదండి. మళ్ళీ అందరఁవెళ్లి నాయురాల్నేసెపి, "ఏఁవమ్మా, మాయింట్ల శవం పోగానేంది, మాఁవింతమందిమి తెల్లార్లూ పడిగాపులుండగానేంద, రేపు పేటపేటందరికీ ఓ రోజు కూలు పోతాయమ్మా! అని బతిమాల్నప్పుడుకూడా, గంట నిద్దర దండుగా, సాలువ కప్పుకొని పక్కని కూకోడఁవే అంత కష్టఁవా"అని నిలదీసి అడగండి.

"ఓరయ్య అంతపనే"— అంటే—

"అప్పుడీ జీవుడు దెయ్యం అవనానికొప్పిసుకోండి."

అని—

"ఇందల ఏదిట్టవోఁ సెప్పండి"అన్నాదు మాటాడపోవ్వతే ఒప్పనన్నట్టు.

దెయ్యాని కెదురెళ్ళడఁవా— పెదల్తో కయ్యానికి సిద్ధపడ్డవా? దెయ్యఁవైనా అడో పేద ముసీలి అడముండ దెయ్యం!! పెద్దలా, అమ్మో!

అంచేత—

"ఒద్దొద్దు. ఆ తరవాత వొచ్చీ సికాకులన్ని మనం పళ్లేఁవు. తురకల్లా కప్పెట్టరా? మనోళ్లే. కంసాల్లూ, కొంతమంది బేమ్మర్లూ పాత్తారు. కప్పెట్టేటుం. మరేం పరవానేదు"అన్నాడు ఎరకయ్య.

"ఏం అడిగితె తప్పేట్రా?"అన్నాడు పెరకయ్య పెద్దకొడుకు— అప్పుడప్పుడే మారుతున్న మగగొంతు—

"మీరందరొాల్లకండి— నువ్ సెప్పరా తాతా— నువ్వే నలబయ్యేళ్ళబట్టో, యాభైఏళ్ళబట్టో యీ కులానికంతకీ పెద్దవు. ఇంతకాలవయ్యీ యీ జనవంత— జీవుడనో, బొందనో నువ్ సెప్పిందే నమ్మి, నువ్ సెయ్యమన్నట్టే పెతీదీ సేసినారు. అన్నదమ్ములు కలిసుండడంకాణ్ణుండి, మొగుడు పెళ్లాలూ యిడిపోడంకాణ్ణుండి, అన్నీ నీసేతిమీనే జరిగినాయి. నువ్వగ్గిం దూకమన్నప్పుడు దూకి 'ఆఁ' అన్నప్పుడు ఆగిపోనారు.

"జనాన్నందర్నీ యింతకాలం ఒక్క తాటిమీద నడిపినావు. మంచిదే. ఎప్పటికేనా అనాగేవుండాల అందుసేత నువ్వేసెప్పు. కర్రలుకావాలా, అక్కర్నేదా? శవాన్ని కాలుత్తావా. కుళ్ళనిత్తావా? నువ్వే అన్నావట రేపిటిదాకా యీశవం నిలవదనీ"

అంటూ ఆగిపోయేడు,

సూరయ్య అట్టే ఆలోచిస్తున్నట్టు కూచుండిపోయేడు. అప్పారావు ఆవేశం అతడికి చాలా యిబ్బందిగా వుంది.

"....నీకు తెల్దురయ్యీ. పెద్దోడు జొారావరి సేసిందానికీ. సిన్నోడు సేసిం దానికీ తేడా వుందొారే. ఏడిమీద ఏడెక్కి వురికేత్తే ఏడిసల్లార్నాక ఏడవ్వలసొస్తదిరా. నా నెత్తిమీద ఎన్ని ఎంటికలున్నాయో అన్ని ఎవ్వారాలు సూసినానురా—" అంటూ తన అనుభవసారం చెప్పాలనుంది— కాని ఎందుచేతో చెప్పలేకపోతున్నాడు. అతడు మాట్లాడకపోవడాన్ని అప్పారావు సరిగానే అర్థంచేసుకున్నాడు. సర్రన వెనుతిరిగి, పది అడుగులువేసి. మళ్లా వెనక్కి తిరిగొచ్చేడు.

"ఒరేయ్ ఓరి సూరయ్య తాతా, నిన్ను తిడ్డానికి నాకు నోరురాదు. కాని తక్కిన లంజకొడుకులంత ఇనండి

"ఒందతరాలే అయిందో, రెండొందలత్తరాలే అయిందో, ఇంకా ఎక్కువ కాలఁవే అయిందో— ఆల్లక్కడ, మనఁవిక్కడ; ఆల్లనాగా మనమినాగా వుండడానికి కారణం సెపతాను.

"మనఁవెవ్వరం ఎవడిమట్టుకాడు తిన్నగా సూడం. అక్కడోడో ఎవడో ఒకడొచ్చి మనకి దారి సూపాల. మన్లో సూడగల తొత్తుకొడుకెవడేనుంటే వన్నాదే ఆల్లల్లోకలిసిపోతన్నాడు మనోల్లల్లో వున్నాల్లందరు యీక్షాటోల్లే.

"ఈ— ఈడే శవంకాల్సపోవ్వతే దెయ్యవవుతాదంటాడు. కర్రిత్తెస్తువంటే జొారావరి కూడదంటాడు. రేపైనా కర్రిలెనాగ తెస్తారు? కొానడానికీవ్వాల్లో కర్రిలు కొాట్టుమీన దొారుకుతాయా?

540

"అంటేటి? మనఁవెల్లి ఎవడిపాదాలమీనోపడి ఆడు 'సీ,పో'అంటే 'సిత్తం బాబ'ని మల్లి దయతలిసిందాక. ఆల్ల గుమ్మాంలకాడ అనాగ'బాబ్బాబు, నాయన్నాయనా' అంటా బేపుల్నాగ కూకోవాల. అనాగ తప్ప ఇంకోనాగ మనక్కుర్రిల్లేపు.

"ఇదేకాదు. ఏపేనా అంతే. అందికే– ఆల్లెట్టినా ఎట్టకపోయినా, ఏఁవో, ఎవడికి, ఎప్పుడేటి ఇనాటి అవుసరం వస్తదో, బతికినంతకాలం కలిగినోల్లందరికి, కల గబోయీవాల్లకూ్కడ ఒంగొంగి, ఒదిగొదిగి ఒంకదణ్ణాలెడ్తా ఆళ్ళెన్నన్నాపడి, ఏ పని సెప్పినా తలతోసేస్తాఁవు–

"మరాడు యజమానీ మనం ఆడికింద తొత్తులుం అయినాఁవంటే ఆడిది తప్పా. యీడిదితప్పా నేవోప్తే నీదీ, నాదా తప్పు? ఆలోసించండి"అన్నాడు.

ఎప్పుడు గందికి మొదలయిందో, ఎప్పుడు అప్పారావుగొంతు పెరిగిందో అప్పుడు జనం పోగవడం అరంభించేరు. ఎగువీధి, దిగువీధుల్లో మనుష్యులు పరుగె డుతూంటే తెలివొచ్చిన వాళ్ళందరూ ఎమిటో ననుకుంటూ పక్కవాళ్ళనిలేపి మరీ తీసు కొచ్చేరు. ఆ అందరిమధ్యా అప్పారావు చెపుతున్నాడు–

"ఒరేయ్, ఓరితాతా! ఇందాక నాయురాలు మమ్మల్నేవని దెప్పిందోఎరికా?"

"అవున్రా! పంటలు కిందా మీద్దైతే, పన్లెక్కడా లేవమ్మా"అంటూ గింజా గిట్రికీ మాయక్కడికే పారొస్తారు; ఏ పండుగొచ్చినా పున్నఁవొచ్చినా, ఓగుడ్డ పాత బడీనా, కసింత బువ్వఎట్టపా, అని మామీనోనే ఒచ్చిపడతారు; ఎక్కడేనా యిల్లోగిల్లో కాలిపోతే కమ్మరేకులకీ మామీనే ఓల్తారు; సివరికి మీరు సచ్చినప్పుడు కర్రలూమాఁవే సపిలీసెయ్యాలిరా" అందా అమ్మ

అయమ్మకు దణ్ణంపెట్టాల!

ఆ యమ్మ నన్ను దెప్పినా, నాపుటకని దెప్పినా, నాకు నసిబాటురాదు. మని సంత మనిసినై కాలూసేతులూ వున్నా నానోకుక్కనీకాను, గొడ్డునీకాను; సెట్టుమీద పిట్టకన్నా, నానన్నాయఁవని సెప్పిందాతల్లి.

ఒరేయ్, ఓర్లంజకొడుకుల్లారా! మనఁవందరఁపేటనుకుంటాఁవంటే అడుక్కు తిన్నైనస తింటాఁవుకాని, అన్నాయం నాకొద్దనుకుంటాం. ఎందుకురా, అన్నాయం ఒద్దంటే, ఒచ్చీ జలమలో కుక్కనో, పందినో కాకుండ! ఇప్పుడు నీబతుకు అంత కన్న ఏటిమెరుగు?

నీకీకబురు సెప్పినోడు నీలాగ నాయంగబతుకు తన్నాడా?

ఇయ్యాలా రేపూ పేదోడెవడు? ఎపుడైతె నాయ్యవని, దరమ్మవని, ఆపెద్దోళ్ల సెప్పిన కట్టుబాట్లుకి ఒసలకంట ముందంత నడిసిన మార్గాన నడుస్తాడో ఆడల్ల పేదోడు. ఎవుడైతే నాయ్యవూనేదు, దరమవూనేదు, నాను పెద్దోడ్నికావడవొక్కటే నాకు నాయ్యవనుకుని, పదికొంపలార్పనానికీ, పదిమంది పొట్టలు కొట్టనానికీ జంకడో, ఆడే యీనాడు గొప్పోడు.

మంచోడు అడుక్కుతిన్నానికీ, సెడ్డోడు రాజ్జ్యవేలేకాడికీ వొచ్చింది— ఆడు సూపేదారీ, మనం నడిసేదారీ.

"ఇది వినొన్నగమన్నాను. ఎందుకు? అడ్నాగమన్యవూ కోటికి పడగెత్తనానికి కాదు. కుక్కనాగ. గొడ్డునాగ కాకన్నా కసింత మనిసినాగ బతకనానికి— అందుకూ" అంటూ - ఆఖరిమాటగా అన్నాడు.

"ఈ శవాన్ని మీరెనాగ ఒదుల్చుకున్నా నాకొక్కటే, ఎందుకంటె

నీట్లో ఒడేసినా, నిప్పుల్లో కాల్చినా, గొయ్యితీసి పాతిపెట్టేసినా— ఏంవీనేదు. కాష్టాల్లో గాలికొదిలేసినా ఈశవం శవం నా గుండిపోదు. ఎందులసేరవల్సిది అందలో ఎనాగూ సేరిపోద్ది. జీవుదేడుత్తాడనీ నాననుకోను, సచ్చిన శవం కోసం నానేడవనూ ఏడవను.

"నా ఏడుపల్లి బతికున్న శవాలకోపం, ఎంతకాలం మీరిలా కుక్కల్లాబతుక్కుతారు? బూమ్మీద పడ్డది నగాయితూ బూవిలో కలిసిందాకా ఈకుళ్ళడమెందుకు? 'జీవుడు నరకానపడకండ' అంటారు, మరి జీవుడు నరకాని కెల్తిందంటె 'బొందికేంవాపదొస్తదో' నని మీ బెంగ.

మీకు జీవుడు మీనానేదు, బొందిమీనానేదు— నాకగపడ్డకాడికి మీకున్నదల్లి ఒక్కటే— సలి సంకటం.

"ఈ సలిసంకటం మీ ఎన్నుపూసల్లో పట్టేసి ఎంవుకలు దొలసేసి, రక్తమాం సాలరించీసి మిమ్మల్ని బతికుండగానే శవాల్ని సేత్తాంది. తక్కిన జీవుళ్ళన్ని ఒక్కపాలేసత్తయ్. మీరు నూరేళ్ల సత్తారు. ఒక్కపాలి సావడంవంటే మీకు ఒణుకు. కసింత కసింత సవ్వడం మీకు శవాసుగుంటాది పొండి, అనాగే సావండి మీ బిడ్డ బిడ్డ తడసంతరానికిదే తరిపీదు యియ్యండి" అంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయేడు.

మూగిన జనంవందరూ 'ఏటంటె' 'ఏటంటూ' భోగట్టాలారంభించేరు.

542

"ఆఁ ఏటినేదు. ముసిల్ది సచ్చిపోనాదికదా. కర్రలడుక్కోనానికెల్తె, నాయురాలేటో అంది. దానిమీనిక్కడకొచ్చి. పేదోల్లంకాబట్టికదా అనాగంత మాటంది, మన పెంతకాలం పడతాఁవంటాడు అప్పారావు" అన్నారు కొందరు.

కాదు, కాదు. యింకా శానావుంది సూరయ్యతాత నేదా. అణ్ణడిగితే కాలుద్దువనీ సెప్పడు. కప్పెడుదువనీ సెప్పడు. సందీ మందిగ గోడమీద పిల్లినాగ సెప్పినాడు. నీకేటర్రియ్యా. అంత బయ్యం. తిన్నగసెప్పరాదా? కాల్పపోతే జీవుడు దెయ్యఁవైపోదా? అనాగని యీడ దెబ్బలాడతన్నాడు" అంటూ ఆడవాళ్ళకి ఆడవాళ్లూ, పిల్లలకు పిల్లలూ ఎవరికర్థఁవైనట్లు వాళ్లు చెప్పుకున్నారు.

మరికొందరు కుర్రాళ్లు మాత్రం బిర్రబిగుసుకొని ముసలాళ్లేమంటారో, ఏ నిర్ణయానికి వస్తారో చూస్తూ అలా చుట్టూ నించున్నారు.

చాలాసేపలా కూర్చుని బారికకన్నయ్య "మరేటాప్రి, పెద్దోడా, ఏదో ఒకటి తెల్సీ" అన్నాడు సూరయ్యతో.

"నానేటి తేలుస్తాను. ఇప్పుడా ఎల్లినోడు ఏటన్నాడో అంత ఇన్నారుగదా, మీరేసెప్పండి. నాకేఁపనడానికీ, ఎటు సెప్పనానికీ తోసదు" అన్నాడు సూరయ్య.

"నాయురాలందనేకాదు. ఆయమ్మని నాసెనకేసుకొచ్చినాను. అదీ నాఒల్ల తప్పు. ఆకోపం యీకోపం అంతా నీమీన ఒలిపినాడు. అంతేగాని, నవ్వంటె ఆడికెప్పుడూగురే. ఇన్లేదా నిన్నొదిలి మమ్మల్నే తిట్టినాడు" అన్నాడు కన్నయ్య.

"నువ్వలాగంటావు. నన్ను తిట్టలేక మిమ్మల్ని తిట్టినాడని నాననుకున్నాను. ఏది నిజం?" అన్నాడు సూరయ్య

....నిజం సిగ్గోసిరినిజం? నిజానిజాలసంగతి ఆ తరవాత చూడ్రాదా. ముఁదు ఈ శవాన్నేంచేస్తారు? అది తెలిస్తే బాగుణ్ణు— అనుకుంటున్నాడు రాజయ్య

బారికకన్నయ్య లోకంచూసినవాడు. అందుచేత అతడు ఏవేళా తల్లకిందులు కాడు. ఒక్కొక్కళ్ళనే తమ తమ అభిప్రాయాలు చెప్పమన్నాడు. పెద్దలందరిదీ ఒకటేమాట. ఆ శవాన్ని ఏదోఒకవిధంగా పాతిపెట్టేడఁవే మంచిదన్నారు.

"ఏఁవీ, ఈపని తొల్లాఁవునే పేస్తేకాదా? ఇప్పటిదాకా యీ జాగరాలేల?"

"అదంతే. సదుల్లో తేల్పడఁవంటే ఏటి? నుప్ గుంటడివి నీకుతెల్దు. ఇలారా." అన్నాడు చఁవత్కారసీతయ్య. పెద్దవాళ్ళెవరూ గమనించిలేదు. అరడజను మంది కుర్రాళ్లు ఎరకయ్యగారి జంతిలోంచి ఎటో పెళ్తున్నారు.

* * *

అప్పారావు కొయ్య. అతడి తండ్రి చిన్నప్పుడే పోయేడు. తల్లీ తనూ, ఆ తల్లి ఒకళ్లజోలికి పోదు. ఒకళ్ల శొంఠికిపోదు. తనమీదకొస్తే దేవుడికొడుకునైనా క్షమించదు.

అప్పారావుతండ్రి పోతూ పోతూ రవంత మడిచెక్క మిగిల్చేడు. దాన్నే దున్నుకుంటూ దానిమీదే కూరా నారా పండిస్తూ, ఒకచిన్న బర్రెనూ, రెండు మూడు మేకల్నీ మేపుకుంటూ ఎన్నికష్టాలొచ్చినా, యముడు వాకిట నిలబడ్డాకానీ అప్పుచెయ్యకుండా, ఆభూమి నిలుపుకుంటూ, ఆదిని తల్లీ, యిప్పుడు కొడుకూ, ఆ చిన్న సంసారాన్ని యీదుకొస్తున్నారు.

ఆ పూళ్లో బడివుందికాని అప్పారావులు చదువుకోలేరు. అతడు కొన్నాళ్ళు పశువులుకాసేడు. కొన్నాళ్ళోనాయుడుగారింట కంబారిగా వున్నాడు. మరికొన్నాళ్ళు పట్నానికి పోయి బరువులుమోసేడు.

ఇప్పుడు కూరగాయలు పండిస్తు, దొరికినప్పుడు కూలిచేస్తాడు. అతడికి పెళ్ళికాలేదు. నారెమ్మలాంటి ఆడపిల్లలెందరికో అతడిపై ఆశ. అప్పారావింకా ఆలోచిస్తున్నాడు.

* * *

తలాబేడా, పావలా చొప్పున నేసిన డబ్బులన్నీ వీరి శవానికి బొడ్డుమూట కట్టేడు దండప్పగాడు

డబ్బులు లావుగానే దొరికేయి. అప్పారావుచేసిన 'గందిక' ఎందుకు పనికొచ్చినా రాకపోయినా యిందుకు పనికొచ్చిందనుకున్నాడు దండప్పగాడు.

శవాన్నిఎత్తేవరకూ సాంవాలు మామ్మోలుగానేవుంది. ఎత్తి పాడెమీద పెడుతూవుంటే ఆమెకు దుఃఖం పొర్లుకొచ్చింది.

అది గొంతులోంచి వచ్చిందికాదు. నిలువు నిలువునా మనిషిని కుదుపుతూ వచ్చేది. ఇంకొకప్పుడైతే గొల్లుమని దాని పీడ వదిలించుకునేది. ఇప్పుడలా చేయడానికి ఆమెకు సిగ్గయింది. లోపల నట్టింటకూచుని పోలమ్మ ఏడుస్తోంది.

"ఓలెఓలె ఎర్రిదాన నీకేం మతిపోయిందే!"అంటూ ఆడవాళ్ళంతా లోపలికి పరిగెత్తేరు.

"కాల్సనానికి కర్రిలు దొరకనేదు. అదొక్కటే మెర. అది తప్పిస్తే దానికింకేవన్న నోటున్నాదా? మనవలు, మనవరాళ్లు, మునిమనవలు— ఎన్నేళ్లు బతికితె

మాత్రిం ఎప్పుడో ఒకప్పుడు ఎల్లక తప్పుతాదా— ఒత్తి మనసిపేన కావు. ఒల్లకో ఒల్లకో—"అన్నారు కొందరు.

"అందరం ఏనాటికైన అక్కడకు సేరవాలసేవాళ్ళంవే. కసింత ముందూ యెనక—"అంటూ తమని తామే పూరడించుకున్నారు కొందరు.

పడమటి చంద్రుని వెన్నెలలో పాతికమంది పాడెవెంట చెరువుగట్టుకొచ్చేరు.

గాలీ, మంచూ, ఇవే చల్లనంటే కాలికింద మెత్తని యిసక గాలికన్నా మంచుకన్నా చల్లగావుంది.

చెరువుకి మధ్యగా స్మశానం. తాడెత్తుమంచు సముద్రంకింద, ఆవల్లకాడెక్కడో అట్టడుగునుంది.

"ఎందుకింతమంది? ఇదేటి.... పగలా? దిగడండి, దిగడండి" అన్నాడు బారిక కన్నయ్య.

"అయితే మాంవుండిపోదువా?"అన్నాడు సొట్ట పాపడు.

"నువ్వురా, నువ్వూ, దండప్పిగాడూ, గటాన్ని మోసినోళ్ళు, ముందు నడిసినోళ్ళు, కాక మాంవో ముగ్గురుం— యీళ్లు సాలు కొందరెల్లినారు" అన్నాడు కన్నయ్య.

జనం గట్టుమీదనిలబడిపోయేరు, పాడె, పాడెతో మనుష్యులు మంచులోకి మాయమౌతున్నారు.

ఇద్దరు మనుష్యులు గునపాలతో పొడుస్తుంటె యింకో యిద్దరు పారలతో మన్ను విసురుతున్నారు. దానికి నాలుగుబారల దూరంలో మసిపారిన పాతరైటు, ఆ పక్కనే తల్లి శవంతో ఎరకయ్య, వాళ్ళకి కొంచెం యిటుగా పెద్దవాళ్లు ముగ్గురూ కూచున్నారు.

'ఆ నక్కలు సూడు. ఎనాగ సంగీతాలు పాడతన్నాయో'అన్నాడుఎరకయ్య.

దూరదూరంగా రెండుజట్ల నక్కలు ఒకటొదిత్తే ఒకటి వూళలేస్తున్నాయి.

"అందికే కంపలు. కంకల్దాక గొయ్యితీసి పాతెట్టినాక మన్ను పూడ్సాం— మూరశ్శోతున యీ ముళ్ళకంప పరిసి దానిమీన మళ్ళా మన్ను— అప్పుడీనక్కలు మరి తవ్వనేవు."అన్నాడు కన్నయ్య.

రాజయ్య విపరీతంగాకురిసే మంచుగురించీ, తడిసిపోతున్న దుప్పట్లగురించీ చెపుతున్నాడు.

"జీవుడికి, ఎండాకాస్తే, ఓనాకాస్తే— అయితే ఆటిదెబ్బ ఎదూరుగా కనబడతాది. మంచు, సలి అనాక్కాదు. సన్నసల్లగా జీవుడిని తినేస్తాయి. సూడవా యీ శీతాకాలంవొస్తే గడ్డికాణ్ణుంచి ఆకూ అలవాకాణ్ణుంచి యినాగ మాడిపోతాది—" అంటున్నాడు సూరయ్య.

అవతల పని ఆగిపోయింది.

"ఏ'విరయ్యా ఏటో జాలంవూ?" అన్నాడు రాజయ్య.

జాలంవే, మరి. ఐదుకాయల సారా వచ్చింది. ఆటి బిరడాలింకా తియ్యలేదు.

"ఏటితవ్వుతాంవూ? సలికి ఏళ్లు కొంకర్లుపోతన్నాయి" అన్నాడు నలుగురిలో ఒకడు.

"ఏళ్ళు కొంకర్లుపోవా? సారాసీసాలెదురుగ కనబడతన్నాయి. రండి రండి మాపనీ అనాగేవుంది" అన్నాడు రాజయ్య.

గునపాలూ, పారలూ అక్కడ పారేసి చేతులకూ కాళ్ళకూ అంటిన మట్టి దులుపుకుంటూ ఆ నలుగురూ బయల్దేరేరు.

మట్టివాసన. అందులో స్మశానాల్లోని వేడి మట్టివాసన.

రాజయ్య రెండు సారాసీసాలు ముందుకి తీసేడు. కన్నయ్యలేచి లాంతరు తెచ్చేడు. నీళ్ళకుండ మధ్యకొచ్చింది. అందరూ వాటిచుట్టూచేరేరు.

"ఏంవిరయ్య రావూ?" ఎరకయ్యనుద్దేశించి అడిగేడు సూరయ్య

"నానిప్పుడుకాదు. ఇప్పుడుకాదు" అన్నాడు ఎరకయ్య.

"పోనీ ఆణ్ణోణ్ని. అందాక ఒకొక్కగిలాసే— ఆ తరవాత— అందర్రావాల. తానాలున్నాయికావా?" అన్నాడు కన్నయ్య.

తలోగ్లాసు తీసుకునేసరికి శరీరాల నంటిన చలి విరిగింది

....మరికొక్కగిలాసు. ఆ తరవాత మరి మాకొద్దునే ఓ- ఆపాటిసాలు. ఆపాటిసాలు— సలి తుక్కుదుళ్ళినట్టు దుల్లతంది- మరి బేగినెగండి. గబగబ నాలుగు పోట్లుపొడిసి నాలుగు పారలు తవ్వేత్తురా అప్పిటికి పీకనోతౌతాది. పీకనోతు ఎక్కితొక్కి. ఏంవిరయ్యా! సరిపోదా— శానశాన. అదే అశంకం— సాలపోృతె యిప్పిడే సెప్పీ— మరెర్రిందుపోట్లు పొడిసేస్తాం— సేతులో పనేనా— మళ్లపోవాలా, మాన్నేలుపోవాలా? మళ్లా ఆ నక్కలొకటి ఎలా క్కాసుకూకుసున్నాయో సూడు. ఊళ్లే పాడతన్నాయి. ఓం... ఓ ఓ ఓ .......

546

"తొత్తుకొడుకురికి ఏదెక్కిందిి"అన్నాడు రాజయ్య.

"ఎల్లండెల్లండి" అన్నాడు కన్నయ్య.

అట్టే తరమక్కర్లేకుండానే బయల్దేరేరు తప్పేవాళ్లు.

కొంతసేపు వోయేక—

"ఇందాకల్నుండి ఆ గుంటడిమాటలే నాకు సెవుల్లో గింగురుమంటున్నాయ్-" అన్నాడు సూరయ్య. ఆడేటంటాడంటే, మనకిక జొరావర్నేపోతె మనం బతకనేఁ వంటాడు.

"నిజిఁవే. తల్లి బూదేవత దీనిమీదుండే పొలాలు పుట్రిలు, సెట్టూ సేఁవా, గొడ్డూ గోదా— మనిసి బతకటానికేటేటైతె కావాలో, ఎన్నెన్నైతే వున్నాయో అన్నీ, ఒక్కటి మిగల్సకండ, నాదంటె నాదంటా, జోరావరితనం ఉన్నోళ్ళందరు, ఎవడి జోరకిందికి ఆడు నాగీసుకున్నాడు, ఇప్పటికీ నాగేస్తనేవున్నారు"

ఇయ్యేల ఆలు కూల్లికి పిలిస్తె మనఁవంతా బతికినట్టు నేపోతే యీ పేదోల్లంత అనాఁగ బిడ్డాపాపా ముసిలీ ముడగా కలిపి, పల్లిగరగరుసుకు సవ్వవలసిందే, పేదోళ్ళ కింకోదారికంనేదు.

అయితే రాజైఁవలాగుంది. దాన్ని నువ్వూనానూ మార్చగలదుఁవా? పెద్దోడు జొరావరి సేస్తేపేదోళ్లు ఆపనేరు కోరుట్లు కెల్లాల. వుంకో పెద్దోడితో సెప్పుకోవాల. మనకాడ ఆ కోరట్ల కెల్లనానికి డబ్బానేదు మనమాటమీన ఎవురికీ కాతరానేదు. మనకి జొరావారీకిదిగనానికి గుండెలేనేవు సస్తంటె మరేటని దిగతాఁవనుకో. ఆ పనానికి ఆలకాడ ఎన్నుండాలో అన్నీపున్నాయి. డబ్బు, దనంం, మనసులు, యింకాకావిలిస్తే పోలీసులు అన్నీను!

నాకు బాగ్గేపకం. నాకు గ్యానం వొచ్చిన్నాటికి యీవూళ్ళో బాపనా, కోఁవటీ కాపూ, కమ్మా, గొల్లా, శగిడీ, మాలా, మాదిగా, యీల్లాలనకు అందరికీతో లేఁవో, లావో పొలంఁవంటా పుండేది. పండినా పండపోయినా ప్రతీ ఒకడికీ నాకేఁవనే బరోసావుండీది.

మల్లా యీ పాతికముప్పై ఏళ్ళలో పంటలు పెరిగినాయి, పశువుల మేతకేన నేకండా బంజర్లు, పోరంబోకులు అన్నీ దున్నీసినారు. మిసీన్లు, గిసీన్లు, ఎరువులు. గిరువులు ఎన్నొచ్చినామో సెప్పనేఁవు—

"అయితె యిన్నొచ్చినా జరిగిందేటయ్యా. జనానికి తిండినేదు. జనంపప్పుల పాలైనారు. ఎంది బంగారాలు ఎప్పుడో పోనాయి. సూజ్జాస్తుండగే గొల్లలు, శగిడీలు, మాలమాదిగ సిన్నరైతులందరు దుల్లిపోనారు. ఎవ్వరికీ సెంటుముక్క మిగ ల్నేదు. కాపోళ్ల దాగునేరు, అందల పెద్దనాయిళ్ళకీ సావుకోర్లకీ సెందిపోయింది యీ బూదేవతంతా!

మా తాత్తండ్రుల్నాడూ కరువులూ కాటకాలు వొచ్చీవిట. ఒస్తే ఆ దెబ్బ అందరికీ తగిలీదట. ఇప్పుడనాక్కాదే— కొందరి బతుకులేంవో రోజురోజుకి దిగనాసి పోతన్నాయి. ఇంకొందరు యియ్యేల బుక్కాపకీర్లు— తెల్లారి నెగిసీసరికి నవ్వాబు కార్లవుతున్నారు.

ఈ కాపులనగ, పడిశాలోళ్ళనగ, కోవటిచేమ్మర్లకీ రాజులికీ ఆదినుంచీ ఉందినే, యీ ఎలట్రీనైట్లు, యీనగిసి నగిసీ దిరేసులు, వోచీలు, రేడియోలు, మోటారు బళ్లు, తెల్లారి నెగిస్తే పట్నానికి రాకపోకలు, అక్కడ రాత్రి పొగలూ జలసాలు, యియన్నీ పూర్వం ఎరుగుదురా? ఆళకా సొమ్మంత ఎక్కణ్ణిండొస్తాంది; మనంపీనచ్చిన మనిసికి కర్రిలేన ఏల పోగుసెయ్యలేక పోవాల?!

ఆడన్నట్టు వొందతరాలే అయ్యిందో ఏలతరాలే అయ్యిందో ఆళక్కడా మన పిక్కడా వున్నావు. ఉన్నా ఆదిని పంచుకున్న బూదేవత అనాగేవుండీది. అటు కదిలి యిటు కదిలి యీ యిన్ని తరాలుగడిసినా ఎక్కడదక్కడే వుండేది.

ఈ నలబై యాబై ఏళ్ళబట్టే, అందులోనూ యీ సివర పాతికేళ్ళయే— మీన ఎక్కడేటయిందో తెలీదు, శకార్లిలు తిరిగినట్టు తిరగతన్నాయి జాతకాలు. ఇయ్యేళ ఉన్నోళ్లు పదిమంది రేపిటికి లేనోళ్ళు. ఇయ్యేళ జరగనోడు ఒకడు రేపిటికి మారాజు. ఒకడు నెగిసీసరికి వొందమంది; పదిమందినెగిస్తే ఏలకొద్దీరాల్తన్నారు— జనం!

ఈ పద్దతంత ఎపుడుతెచ్చినాడు— ఎప్పుడొచ్చింది?—తెనీదు— ఎందుకు తెచ్చినారు, ఎలాగ నడపతన్నారు తెనీదు.

"ఈ పద్దతికి పెద్దలేసినగట్లు గోడలన్నీ తెగిపోతన్నాయి, తెగిపోవడం మంచా సెబ్బరా? ఎవిరికి మంచి ఎవరికి సెబ్బర? అదలాగుండగ మళ్లా కొత్తగోడలు, కొత్తగట్లు నెగుస్తున్నాయి— యియి దేనికి?

"ఈ కొత్తకి తగినట్టు నడవడం జనానికి తెలవాల. అదెనాగో ఆతెచ్చినోలకి తెల్సు. మనకి తెల్దంనేదు,

"పెద్దోడి జొరావరీ ఆ తేడంకాడా, నడపడంకాడా వుంది. అది మనకంటికి కనబడదు, అది సూణ్ణానికి మనకంతపాటి గడుస్తనంనేదు.

"అయితే అన్నేయ్యం కొనదాకా సాగుతాదా- అడ్డపోవ్తే? సాగదనే అనుకుంటాను-" సూరయ్యకళ్లు జవాబుదగ్గరకొచ్చేసరికి మూసుకుపోయేయి. కొంచెంసేపు మగతగా ఆలోచించి అన్నాడు.

మన తాతతండ్రులనీవోరు- ఎవడిమట్టుకాడు నాయంగ దరమంగ నడిస్తే ఏదెలాగజరగాలో ఆ బగమంతుడే అన్నీ సూస్తాడని. నాకిప్పటికీ ఆ మాట నమ్మాలనే వుంటాదీ. కాని ఆట్టే సూస్తే ఆడున్నాడో నేదో? ఆడుంటేగదా అన్నీ సర్దనానికి. ఉంటే యీ అచ్చాచారవంత ఏటి? మనిస్సచ్చిపోయినప్పుడు సిన్నపిల్లలికి పెద్దోళం మాయికబుర్లు సెపతాం సూసినా- అనాగ యీ తెలిసినోళ్ళు మనకూరుకోపెట్టనానికి అణ్ణొకణ్ణి సూపుతున్నారేఁవో, ఆడునేడే నేడేఁవో- అనిపిస్తాది,

"ఇంకోపాలి- ఆడున్నాడు, ఏదానికైన పాపం పండాలిగదా, దానికోసం ఆడలాగ సూస్తున్నాడనిపిస్తాది.

"మొత్తానికి ఆడున్నాడో నేడో! ఆడున్నాడని పెద్దలు దేనికన్నారో! ఇనాగ నాకు బతుకంతా అనుమానఁవే!"అన్నాడు సూరయ్య.

దేవుడికాడికొచ్చేసరికి కన్నయ్యకి తెలివొచ్చింది-

"ఆఁ.... అనాక్కాదనాక్కాదు -" అంటూ నోట్లో పొగాకు రసం వూసి కసింత ముందుకుజరిగి చెపుతున్నాడు.

"పెద్దలేటంటారంటే కాలం సందీ మంది కొచ్చినపుడల్లా ఆడున్నాడా లేదా అన్నకాడికొస్తాదట. అనాటప్పుడు ఆడింకమీద నుండట్ట బూమ్మీనకే దిగతాట్ట

అయితెనాగ? ఆ శంకూ శక్రం గదాగిదా యియ్యేటుండవు. దేవుణ్ణాగరాడు. మనిసినాగ, మనిసికడుపున పుట్టే, మనిసి సెయ్యగలిగినపన్లే సేస్తాడంట మరలాగ ఆడొచ్చినప్పుడు ఆడెంటసావుకూడా బూమ్మీనకొస్తాదట.

ఇప్పుడు మన ముసిలి కరనం నేదా- ఆయనకో బాప్మరదుండోడు ఒకపాలి కరనమింటికొచ్చినారు,

తగువేడో అయితుంటె రైతులూ మాఁవూ అందరం కరనంగారిక్కాడ పందిట్లో కూకున్నాఁవు, సగంకానిచ్చి ఆలుబోజనానికి నెగిసినారు. బోజనాలైనా[illegible]వా

మరుదులు లోపలేటో మాటాడుతుంటె, పంతులు యీతలకొచ్చీనాడు. ఏటీ తగువు దేనిగురించంటె ఎవరో బాగార్ల తగువని సెప్పినారు.

ఆడ తగువూ. బూఁవి తగువూ. మాకానివంటూ పంతులు కొన్ని కతలు సెప్పినారు.

రావణాబ్బెమ్మటా గొప్ప దైవబక్తుట్ట. ఉదయం నెగిసినాక కోటిలింగాలికి బంగారప్పువ్వులెట్టి పూజ్జేసీవోడు.

అయితేటీ సీతా అమ్మవోర్ని దొంగిలాడినాడు.

సీతంటెయేటి? బూదేవికూతురు; నాగేటిసాల్లో పుట్టింది; తల్లి లచ్చిఁవీదేవి. ఆయమ్మని యిడిపించనానికి ఎందరెన్ని రకాలుగా సెప్పినా ఆ రావణాబ్బెమ్మయిన్లేదట. ఆడి పదిసిరసులూ నేలమీన దుల్లిందాక ఆడు సీత నొగ్గనేదుట.

అనాగే పాండవుల్దీ అళ్ళ బాగార్లదీ రాజ్జింకాడ తగువు.

అప్పుడు కిష్ణావతారఁవెత్తి ఆ బగమంతుడే సాయాంగెళ్ళి నానింతోణ్ణి సెపుతున్నానినుకోండారి, అంటూ తన అవతారాలన్నీ సూపినాడు. ఐతె యిన్నారా నెత్తు టేళ్లు పార్నాయిట.

మంచిగ సెపితే మనిసి యినుకోడు— అన్దానికి ఆయన ఆ కతలన్నీ సెపతన్నాడు. ఇంతలో కరనంగారి బామ్మరిదినేడా ఆయన దిగినాడు. ఆయనకి పట్నంలో వుద్యోగం. పెద్ద సదువులే సదివినాడు.

రాఁవుడూ దేఁవుడు కాడు, కిష్ణుడూ దేవుడుకాడు ఆలూ మన్నాటిమనసులే. మంచికోసం పాటద్దారు కామట్టి దేవుళ్ళన్నారు. పురాణాలన్నీ కతలే అంటాడు ఆయిన.

మనసులు. మంచికోసం పాటడీనోళ్లు. ఎంతమంది నేరు అందర్నీ దేవుడన్నారా ఎవుడైతె దరమం నిలపనానికి అన్నీ ఒగ్గేసి అడ్డొచ్చినోణ్ణవణ్ణైనా సంపనానికి జంకడో ఆణ్ణి దేవుడంటారు— ఎందుకు? ఆళ్లో దేవుడుంటేగాని అంతపని సెయ్యనేడు. అందుకు! అంటాడు పంతులు.

దానిమీద యిద్దరికీ పెద్ద వాదనయ్యింది, సివరికి పంతులే నెగ్గినాడు. నెగ్గీ సివార్న అన్నాడు

ఈ కలికాలంలోనా బగమంతుడు అవుతారం ఎత్తుతాట్ట. ఐతె యీ పాలి ఆ బాణాలు గీణాలు. ఆ శక్రాలు గిక్రాలు అన్నీ ఒగ్గేసి కత్తొట్టుకు నెగుస్తాట. నెగసి

550

యినాగ ఊరురు ఎళ్ళీ; ఎనాగ? గుర్రిం మీన; యీ పాపాలు సేసినోళ్ళందర్నీ నరికి పోగులెడతాట్ట.

ఇప్పుడ్డాకో అనుమానఁవు. ఈ కత సెప్పి శానాకాలవయ్యింది. అప్పటికీ యిమానాలు గిమానాలు యీ బాంబులు యియ్యన్ని యిన్ని నేవు. ఇప్పిడివన్ని ఒచ్చి నాయి కదా? ఎంత దేవుడైతేమాత్రిం యీ యిన్నిటితో సాలగల్డా? సాల్నేపోప్తే ఏటి సేస్తాడు?"

ఈ ప్రశ్నవేసి ఆగేడు.

ఎవ్వరూ జవాబివ్వకపోయేసరికి తనే చెప్పేడు.

అప్పుడు ప్రళయంతేవాల. అది తేవడంతప్ప ఆడికింకో దారినేదు. దాని కాడ తుపాకులు గిపాకులు బాంబులు ఇమానాలు యియ్యేయీ ఆగవు. అది జోరావరి లన్నిట్లోనీ పెద్ద జోరావరి. దానికి తిరుగునేదు.

అదొస్తె అప్పుడెనాగుంటాది ఎరికా? ఈ మేడలూ నేవు, ఈ మిద్దిలూ నేవు. ఈ గట్టులూవుండవు, యీ పుట్టలూవుండవు. అప్పుడున్నవ్వు పెద్దాకాదు, నాను సిన్నా కాను. అంతా మూలమట్టఁపైపోయి నున్నగ సమానంగ అయిపోతాఁవు.

అది రావాల. అదొస్తేనే మెరుగు.

అయితె! అది రావడఁపెలాగొస్తాదో ఎరికా?—

మాట పూర్తికాకుండానే "ఏట్రియ్యా!"అంటూ తుళ్ళిపడ్డాడు కన్నయ్య.

దుభీమని ఆకాశంలోంచి వూడిపడ్డట్టు ఓకట్టెలమోపు అతడిముందు పడింది.

తుళ్ళిపడి తలెత్తితె— రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు కట్టెల మోపులు ఒకదానితర్వాత ఒకటిగా నేలనుపడి, ఆ అదుటుకి కట్లు తెంచుకు చెదురుతున్నాయి.

చిక్కని పొగమంచు— వెన్నెల్లో, అవితెచ్చిన కుర్రాళ్లు చుమ్మగుడ్డలు దులుపుకుంటూ మెడలు సవరించుకుంటున్నారు.

"ఏట్రియ్యా?"

"ఏట్రిది?"

"ఎక్కడివిరా?"

"దొంగతనఁవేసినాం! ఎక్కడివైతే నీకేఁవి? నీపని కానీరాదా?" అన్నాడు ముందున్న ఎరకయ్య పెదకొడుకు ఆవేశంతోనూ ఆయాసంతోనూ. అతడు ఘూపోస్తున్నాడు.

551

ఆ వెంట ఇంకో పదిమంది దిగేరు.

"సరిపోతాయిర దద్దా!"అన్నాడొకడు కర్రిలకేసి చూస్తూ.

గొయ్య తవ్వుతున్నవాళ్ళతోసహా అందరూ అప్పటికి కట్టెలచుట్టూమూగేరు.

"సరిపోతాయా? తెమ్మంటె ఇంకా తెస్తాం బోల్డు!"అన్నాడు ఇంకొకడు. పెద్దలందరూ ఎక్కనకైపులు దిగిపోతుండగా అటు ఎండుకట్టెలు వంకా ఇటు కుర్రకారు వంకా అయోమయంగా చూస్తున్నారు.

"ఏవిరయ్యా నిండా తాగినారు కావాల. తాగినప్పుడైనా మీకు దైర్యాలు సాలవా."అన్నాడు మందలో ఒకడు.

"కాదుకాదు. ఆలోసిస్తన్నారు ఆలోసించనీ ఆలోసించనీ"అన్నాడుఇంకొకడు

ఆలోసనా లేదు పాలోసనాలేదు. శవాన్ని అందలేసి కాలుస్తురో నేపోవ్తే అల్లనే కాల్సిమన్నారో అడగండి"అంది వెనకనుంచి ఓ గొంతు.

రాజయ్య అదిరిపడ్డాడు "ఎవుడ్రా తొత్తుకొడుకు?"అన్నాడు కోపంగా.

"అదిగద్దిర మాఁవా! పౌరుసమంటే అనాగుండాల శబాస్!"అన్నాడు చమత్కారి సీతయ్య—

"నీవోడిమీదకైతే నీ కర్రినిగుడుతాది. అత్తలోడే అ మాటంటే 'బాబ్బాబు, నీకెందుకంత సెఁవ? నానే కర్రిలు పేర్పిసుకుని నానిప్పునానే అంటించుకుంటాను, కోప్పడకంటావు. గాంధీబాబు మరెక్కడికీ పోనేదు. ఎన్నాళ్ళయినా మన్ని పట్టుకొని ఒగ్గడు. నాకు నచ్చినాప్"అన్నాడు సీతయ్య.

సూరయ్యకు పరిస్థితి అర్థఁవైపోయింది.

"ఏడీ అడేడి? అప్పారావు రానేదా?"అన్నాడు దగ్గరేవున్న ఓ కుర్రాడితో.

"ఇక్కడికైతే ఆడు రానన్నాడు. అప్పుడు మాఁవే బైలెల్లినాం" అన్నాడు ఎరకయ్య పెద్దకొడుకు.

"బాబ్బాబు, నామాటినండ్రి. కాల్సినా పాతినా ఒకటేనాండ్రి?...." ఇంకా మాట పూర్తి చెయ్యలేదు ఎరకయ్య.

"అందుకే కాల్సమంటన్నారండ్రియ్యా. నీకు పాతడఁవే యిష్టఁవైతే అరో జొచ్చినపుడు నిన్నలాగే పాతెత్తాంసే, మా నాయనమ్మని ఈపాలికాల్సి" అన్నాడు ఎరకయ్య పెద్దకొడుకు—

'వాళ్ల ధోరణి విపరీతంగావుంది. అంతగా ఐతే నాయుళ్ళకి నచ్చజెప్పడమే సులభంలాగుంది. కాళ్ళావేళ్ళాబడి, తప్పైపోయిందంటే, అట్ల కాదన్రు'— సిగ్గుపడుతూనే సూరయ్య మనసులో యీ మాట అనుకున్నాడు—

తర్వాత యింకో అరగంటకి చిటచిట పటపట పెళపెళమంటూ భుగభుగల్తో మంటలు పైకిలేచేయి. చిక్కి చచ్చిన ముసిల్దాని శవాన్ని చితిమీద మంటలు గబగబా చుట్టుముడుతున్నాయి ఆ మంటలుచూసి అటు కంపకి వెళ్లినవాళ్లూ యిటు మాలపేట నుండి కొందరూ పరుగెత్తుకొస్తున్నారు.

సగంగొయ్యి తవ్వి ఆపిన మనుషులికి ఓకుర్రాడు, ఆ కర్రలకోసం వాళ్లెలా బయల్దేరేరో చెప్తున్నాడు.

అప్పుడే రెండోసారి చెర్లో మునిగొచ్చిన ఎరకయ్య తడితలతో తడిగుడ్డతో వచ్చి తల్లికాష్ఠం వద్దనించున్నాడు తక్కినవాళ్లు అటూ ఇటూజరిగి అతనికి చోటిచ్చేరు. ఎర్రని మంటల వెలుగు అతనిమీదా ముఖంమీదా ప్రతిఫలిస్తోంది.

అతడి ముఖంమీద ఎప్పుడూ, ఏంజరిగినా, కనిపించని ఒక ఆనందం వెల్లి విరుస్తోంది. అతనిలో నలుపంతా చెదిరి అతనివెనక నీడగా పడబోతోంది. మంటలు ఆ నీడనికూడా చెల్లా చెదురు చేస్తున్నాయి.

చలికి వజ వజ వణికే ఎరకయ్యకెవరో సారా గ్లాసు అందించబోయేరు— "నాసలి నన్నొగ్గి ఎక్కడికో పారిపోనాది. బైటికొనుకుతున్నానుకాని నాలోపట సలెక్కడ నేదు. సారా నాకోద్దు. నానీయేల సారా తాగను. ఎవర్నైనా తాగీమను'' అన్నాడు ఉషారుగా.

తల్లికాష్ఠం మంటల్తో ఒళ్లు కొంచెం వేడెక్కితే ఆ తరవాత చెపుతున్నాడు,

నా కొకడికీ, నాసినకొడుకున్నాడే— ఆడికొకడికీ, మాయమ్మకొకత్తికీ, ఈ సీతాకాలం పేరుసెపితే మాసెడ్డ బయం. ఈ సీతాకాలమన్నాళ్ళూ మాం ముగ్గురుం పెందిలి నెగిసింది లగాయితు అనాగ ఎండలోనే తారట్లాడతాం. పొద్దుపోతందంటె మా ముగ్గురికీ దడ, మంచుకురిసిన రాత్రియితె మరీ నిద్దరట్టదు తెల్లారూ— యీ సలీ సీకటెప్పటికి పోతాయి, ఎర్రిగా పొద్దెప్పుడు పొడుస్తాది. ఎప్పుడెండలో సేరిపోతామనే వుంటాది. ఇదిగినాటి రాత్తిరొస్తే నానూ నా సిన్నకొడుకూ మా యమ్మా ఒక పది పన్నెండు పరాయాలయినా మద్దెమద్దెన్నెగుస్తుంటాం.

"అనాటప్పుడు ఒక్కోపాలి మాయమ్మనీది 'అయ్యో నానెప్పుడేనా యీ సలికే సచ్చిపోతాన్రా. ఈ సలిసంకటంతోనే సచ్చిపోతాను. సీతాకాలం కర్రలెక్కడ

దొరకవు. కర్రల్దొరకవని కప్పెట్టేకిమే— ఎక్కడేన కానో, అడుక్కునో, సివరికి దొంగతనఁవేనాసరే, నన్ను కాప్సెయ్యాల. బెండెడు కర్రిత్తెచ్చి కాల్సి. నా యిన్నాళ్ళ సలీ కాష్టమ్మీనైన కాలిపోవాల'' అనీది మాయమ్మ.

అందుకే కప్పెట్టేద వంటె. నాకామాటలు గుర్తుకొచ్చి ఆటుపోనేను. ఇటు రానేను. అనాగ నాలోనేనే కుల్లిపోతన్నాను.

ఇప్పుణ్ణా కొడుకున్నాడు— ఆడు నాకన్న శానా మెరుగు. అసలీకాలపు కుర్రోళ్ళే మెరుగు.

తరవాత ఏటన్నాకానీ యిప్పిడీ కర్రిలు తెచ్చినారా— ముండీశవాన్ని కాల్చ డఁవైపోనాది. నేపోప్పెతె నాను బతికున్నంతకాలం కుల్లుతునేవుందును. బైటికి అన్లేను. అయినా కుల్లుతాను.

''రేపు పెదనాయుడు పిలిపిస్తె నానామాటె సెపుతాను. అయ్యా మరింక మించొచ్చింది. ఇదిగిలాగ, మాయమ్మ అనీది. అందుకని నాన్నే యీర్ని బలిమి లాణ్ణాను. ఆ గుంటలేఁవెరగరు. అది తప్పేఅయితె, ఆ తప్పునాది. ఆళ్ళేటనకండి. తన్నాలంటె నన్ను తన్నండంతాను. అంతేకాని గుంటల్నప్పగిస్తాఁవేటి? ఏఁవిరయ్యా?'' అన్నాడు కన్నయ్యతో.

వెర్రివాడు ఎరకయ్య. అతడి వెర్రితనం నవ్వు తెప్పించాలి.

''దేవుడన్నాడొకడుంటె యీళ్ళుసేసినపనికి ఆడు నిజంగ మెచ్చాల. మెచ్చ పోప్పెతె ఆడు దేవుడుకాడు. నాన్సెప్పుతున్నాను కానా ఆడు మెచ్చుతాడు'' అంటున్నాడు ఎరకయ్య.

కురాళ్ళకామాటలు చిరాకూ జాలీ కలిగిస్తున్నాయి. అందులో ఒకడు—

"ఒరే ఓరే దద్ద, ఇంక నువ్వాపు. మాఁవుసేసింది నువ్వో నీ దేవుడో మెచ్చుతారనికాదు. అది నాయఁవని తోసింది. ఆపని సేసినాం. అంతే" అన్నాడు వెనకనుండి— అని-

"కన్నయ్యమాఁవా, మాట్లాడు" అన్నాడు కవ్వింపుగా.

కర్రిలొచ్చినదగ్గర్నుండి కన్నయ్య మనసు అఁవుతిన్నపసరంలా కదుల్తోంది. ఆ తొత్తుకొడుకు చెపితే గుంటలు చెయ్యడం చేసేసు. రేప్పొద్దున్న దీనిగురించి ఏమొచ్చినా ముందు తనపీకమీదికొస్తుంది. ఏదానికీ ముందు నాయుడు తననే అడుగుతాడు.

తెలిసిన నిజం— చెబితే ఒక తప్పు. చెప్పకపోతే ఒక తప్పు. అంతా తన పీకమీద కొచ్చింది. ఇదంతా సేసినోడు ఆడు— మనసులో కుళ్ళుతున్నాడు కన్నయ్య.

గోతులు తవ్వేవాళ్ళెప్పుడూ మాట్లాడరు.

అదిగ్రహించి కుర్రాళ్ళలో ఒకడన్నాడు.

ఓరేయ్ ఓరి దద్దా. మాఁవేం ఇదిరగస్పెంగ సెయ్యడంనేదురా. దొంగపన్లు సేసీవోల్లకే ఒదుగు— రగస్పెంగ ఎవరికంటా పడకండ సేస్తారు. మాఁవేంసేసిన పబ్లిగ్గసేస్తాం. నాయం సెయ్యనానికీ. మంచిపనిసెయ్యనానికీ దొంగతనం దేనికి?—

బతికున్న మనిసైతే నీదీ నాదీ. సచ్చినశవం— ఇది అందరిదీను. అందికే బతికినంతకాలం ఎవ్వరు పలకరించకపోయినా సచ్చిన శవాన్నెత్తడానికి పగవోడుకూడ రావాల.

దీనిక్కర్రిలు కావాల. అవాక్కాడున్నాయి. నిన్నూ. నిన్నూ అందర్నడిగినాం. మీరెవ్వరివ్వనేదు. మాఁవవసరానికి అట్నే తెచ్చినం.

అయితే జోరావరేటీ? జులుంకు మందు జోరావరీ.

ఈ కర్రలు పందిరి అప్పయ్యగారి బాబుగారిసొమ్ము— అయితే ఎలాగైనాయి? అయన్ది కంటిక్కనపడనిదో తెరిపి!

కూతురి పెళ్ళిపేరుసెప్పి. సిననాయుడికి తాను ఊరకొణ్ణని. పెదనాయుణ్ణి అడిగి రెండూ. అడక్కొకటీ. అదిగాదా. ఈ సెరువుగట్టునే అల్లాకాడ తుమ్మమోళ్ల— మూడు కొట్టించినాడు. అదెవ్వడిసొమ్ము? ఊరందరిదీను.

ఆ కొట్టడఁపైన తను కొట్టినాడా? అడిగో ఆసిన్నసీరిగోడూ అడిబామ్మరది బోడిగాడూ కొట్టినారు. దమ్మిడీ కూల్నేదు. కంబార్లుకాబట్టి ఎట్టి సాకిరే.

''మరా కర్రిలమీన అయనకున్న అతికారమేటి? మనకి లేన్దేటి? నాయుడిచ్చిన అతికారఁవేనా? ఇయ్యనానికి అయనెవరు? దానికీ ఏవో రూల్సుంటాయి— అవన్నీ సూసే ఇచ్చినాడా? రమ్మను. అరూల్సే టోసెప్తే. అయన అవి సూణ్ణేదని నానూ సూపుతాను''అంటూ అకుర్రాడు తమ పనిని సమర్థిస్తున్నాడు.

ఇంకొకడు అతణ్ణి ఆపి ఒక్కమాటలో తేల్చేసేడు.

"ఓరయ్య. వాదన్లొద్దు పన్లు సెయ్యడం ఇష్టంలేనప్పుడే తర్కాలొస్తయి. మనకది మంచిపనని తోసింది. సేసేసినాం. 'కాదదిసెడ్డ. అది సేసినందుకు మీపని పడతాం'అంటూ ఆళ్ళొస్తారూ రానీ— ఆళ్ళపని మనఁవూపడతాం. ఇయ్యేళ నిండి

555

యిదేనెక్క. ఒకపనిసేస్తే నాయుడేటంటాడో, కరణం వేటంటాడో బారికేటంటాడోకాదు మంచిపనా, సెడ్డపనా? మంచిదయితే సేసెయ్. దేవుడుకాదు, దేవుణ్ణిపుట్టించిన జేజమ్మేనా దెబ్బలాడు. అదీ మన పద్దతి. పదండి పదండి ఒక్కనుకేన తీస్తేకాని, రేపు తెల్లారి పన్లోకెల్లలేం. పదండి" అంటూ ఒక్కొక్కళ్ళనే కదిలించుకుపోతున్నాడు.

వాళ్లు పది పదిహేను బారలు వెళ్లేసరికి గొంతుల వినికిదేకాని మంచులో మనుషులు కనిపించరు.

చితిమీదికెక్కించిన శవం కాలకపోతుందా? అయినా అది విధాయకం, కాబట్టీ— దానితో వాళ్ళ అనుబంధాలు అంతకన్నా దగ్గరవి కాబట్టీ పెద్దలు కొసవరకూ దానిని వదిలిపెట్టలేరు— తెల్లవార్లూ స్మశానంలోనే వుండి తెలతెల్లవారుతుంటే యిళ్ళ కొచ్చేరు.

ముసిల్ది నిన్నపోయింది. మనిషి నిన్నపోతే యివాల్టికి రెండు, కాని సంధి కాలంలో అలా అనిపించదు నిన్నానేడూ అంతా ఒక్కలాగే వుంటుంది. ముసలాళ్ళ పని అలాగే వుంది.

# ఏకరువు

— యస్. యస్. ప్రకాశరావు.

రావుగాడు నా పీకల మీదికి గొప్పగా తయారయేడు. నేను సాహిత్యరంగ ప్రవేశంచేసి పదేళ్ళే అయింది. కాని (ఈ స్వల్పకాలంలోనే) నేను యిప్పటికి ఇరవై మూడు నవలలూ, ఐదొందల నలభైరెండు కథలూ, పదహారు నాటకాలూ రాసేను. రావుగాడుకూడా యించుమించు యీ పదేళ్లాయి రాస్తున్నా, వాడిప్పటికి ఒక్క నవలా రాయలేదు, కథలు మాత్రం ఓ ముప్పయి రాసుంటాడు. అందుకని, వాడికి నేనంటే చెడ్డ జెలసీ

అవును. నాఅదృష్టం బావుంది; కాబట్టి నేనేదిరాసినా అచ్చవుతూనే వుంది, వాణ్ణెవడు రాసుకోవద్దన్నాడూ? వాడి చేతకాని తనానికి నామీద ఆడిపోసుకోడం దేనికీ?